రాష్ట్ర ప్రభుత్వం 26వ తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు కొత్త సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లాలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నారు. ఇరు జిల్లాల్లో ప్రత్యేక అధికారుల అధ్యక్షతన సభలు జరగనున్నాయి. మండల అధికారులు ఈ గ్రామసభలను పర్యవేక్షించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 26 నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు అందించనుంది. ఇందుకు సంబంధించి ఈనెల 16 నుంచి సోమవారం వరకు ఉమ్మడి జిల్లాలో సర్వే నిర్వహించారు. మంగళవారం నుంచి ఖమ్మం జిల్లాలోని 589 పంచాయతీలతో పాటు 128 మనిసిపల్ వార్డుల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 476 పంచాయతీలు, 80 మునిసిపల్ వార్డుల్లో గ్రామసభల నిర్వహించనున్నారు.



గత శుక్రవారం ముదిగొండలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీతా ఎలిజబెత్

'సంక్షేమ' పర్వం

- లబ్ధిదారుల ఎంపికకు నేటినుంచి గ్రామసభలు
- ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహణ
- నాలుగు కొత్త పథకాలకు ఎంపికలు
- ఈ సభల్లోనే అర్హుల జాబితాల ప్రకటన
- పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం
- ఇప్పటికే పూర్తయిన క్షేత్రస్థాయి సర్వే


కొణిజర్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన హెల్ప్‌డెస్క్

ఖమ్మం, జనవరి 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రతి గ్రామసభలోనూ గతంలోని దరఖాస్తుదారుల జాబితాతోపాటు సర్వేలో తేలిన అర్హులు, అనర్హుల జాబితాను ప్రదర్శించనున్నారు. అభ్యంతరాలు స్వీకరించనున్నారు. రైతుభరోసా సర్వేలో భూమిలేని రైతుల వివరాలు, అనర్హుల జాబితాను ప్రకటించి వారినుంచి అభ్యంతరాలుంటే స్వీకరించనున్నారు. అలాగే కొత్తరేషన్‌కార్డులకు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు కూడా స్వీకరిస్తారు గ్రామ, మండల కారాయలయాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటుచేసి దరఖాస్తులు తీసుకోనున్నారు.

తేలనున్న లబ్ధిదారుల లెక్క

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం అమలు చేయబోతున్న నాలుగు పథకాలకు ఇప్పటికే సర్వే నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో 3,42,803మంది రైతులు 7,40,615 ఎకరాలకు గతంలో రైతుబంధు తీసుకోగా.. ఇప్పుడు రైతుభరోసా కింద క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లాలో 1,85,014 మంది రైతులు 5,09,966 ఎకరాల భూమికి సంబంధించి రైతుబంధు తీసుకున్నారు. ఈ భూమికి సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. పట్టా ఉండి భూమిలేకుండా ఉన్న రైతులు, ప్రభుత్వ అవసరాల కోసం సేకరించిన భూములకు రైతుబంధు పొందుతున్న వారి వివరాలు కూడా సేకరించి వారిని అర్హుల జాబితానుంచి తొలిగిస్తున్నారు. ఇరు జిల్లాల్లో సుమారు లక్ష ఎకరాల వరకు ఈ తరహా భూములు గుర్తించినట్టు సమాచారం.

ఇక ఇందిరమ్మ ఆత్మీయభరోసా కింద జిల్లాలో 3లక్షల ఆరువేల ఉపాధి హామీ కార్డులుండగా అందులో లక్షా 60వేలు కూలీలు మాత్రమే పనుల్లో ఉన్నారు. అయితే ఏడాదిలో 20రోజులపాటు ఉపాధి పనులు చేసి భూమిలేని కూలీలను మాత్రమే ఏడాదికి రూ.12వేలు ఇవ్వనున్నారు. ఈ పథకంలో జిల్లాలో 40వేల మంది వరకు లబ్ధిపొందే అవకాశం ఉంది. భద్రాద్రి జిల్లాలో 2లక్షల 19వేలకార్డులుండగా లక్షా 35వేల మంది ఉపాధి పనుల్లో ఉన్నారు. ఇక్కడ సర్వే అనంతరం సుమారు 30వేల వరకు అర్హులున్నట్టు తేలింది. అయితే ఇవికూడా గ్రామసభల్లో లెక్కతేల్చనున్నారు.

రేషన్‌కార్డులకు సంబంధించి రెండు జిల్లాల్లోనూ సర్వే నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో 30,669 దరఖాస్తులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 43వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో లక్షన్నర వార్షిక ఆదాయం, పట్టణాల్లో రూ.2లక్షల ఆదాయం, వరకు ఉన్న వారికి తెల్లకార్డులు మంజూరు చేయనున్నారు.

ఇంకా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు రాగా సర్వేలో వడపోశారు. ప్రజాపాలనలో ఇళ్లలేని వారు ఖమ్మం జిల్లాలో 3లక్షల 57వేలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2లక్షల 73వేల దరఖాస్తులు రాగా వాటిపై సర్వేచేసి అతి నిరుపేదలను గుర్తించారు. నియోజకవర్గానికి 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. ఒక్కో ఇంటికి రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు మంజూరు చేయనున్నారు. నాలుగు రోజులపాటు జరిగే గ్రామసభల్లో మొత్తం లబ్ధిదారుల లెక్క పక్కాగా తేలబోతోంది. అయితే ఇందిరమ్మ కమిటీలకు ఈ గ్రామసభల్లో భాగం చేయడంతో గ్రామసభలు నిర్వహణ అధికారులకు పరీక్ష కానుంది.

అదో అవినీతి అడ్డా

- వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి అవినీతి జాఢ్యం
- కాసులిస్తే చాలు యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వ స్థలాలను సైతం ప్రైవేటు వ్యక్తులకు రాసిచ్చిన చరిత్ర
- మూడేళ్లలో ఆరుగురు సబ్ రిజిస్ట్రార్లు
- డబుల్ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో సస్పెండైన తాజా అధికారి
- అవినీతి ఆరోపణలతో గతంలోనూ పలువురి తొలగింపు

వైరా, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. ఇక్కడ పని చేసిన కొందరు రిజిస్ట్రార్‌లు పభుత్వ భూములను సైతం ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసిన ఉందంతాలున్నాయి. ఇంత జరుగుతున్నా జిల్లా, రాష్ట్ర స్థాయి రిజిస్ట్రేషన్ స్టాంప్స్‌శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మూడేళ్లు ఆరుగురు... సబ్‌రిజిస్ట్రార్‌లు

వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 1996లో ఏర్పాటు చేశారు. అప్పటినుంచి నేటి వరకు ఆరుగురు సబ్‌రిజిస్ట్రార్‌లు ఈ కార్యాలయంలో పనిచేశారు. వారిలో ఇటీవల సస్పెండ్ అయిన బి.రామచంద్రయ్య ఒక్కరే గ్రేడ్-1 సబ్‌రిజిస్ట్రార్ కాగా, మిగిలిన ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లే ఇన్‌చార్జ్‌లుగా పనిచేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆరోపణలు..

పాత భవనంలో కార్యాలయం ఉన్న సమయంలో పనిచేసిన ఒక రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ అందినకాడికి దండుకొని అనేక ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వైరా ఐదోవార్డులోని ఓ గుట్టపై ఉన్న 274గజాలతో ఉన్న ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌ను అడ్డుపెట్టుకొని అంకెలు మార్చి 724గజాల స్థలానికి రిజిస్ట్రేషన్ చేసి రూ.లక్షలు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే రెవెన్యూ అధికారులు అనేకసార్లు ఈ స్థలంపై సర్వే చేశారు. ఇది ప్రభుత్వ స్థలం అని ఓ ప్రైవేట్ వ్యక్తికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదికను పంపించారు. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు.

అదే సబ్‌రిజిస్ట్రార్ వైరా మునిసిపాలిటీకి చెందిన పూర్వపు పంచాయతీకి చెందిన బావుల స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేసి భారీగా కాజేశారనే ఆరోపణలున్నాయి. మునిసిపాలిటీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు వాటిలో భవనాన్ని నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా వైరాలోని ఎన్నెస్పీ కాల్వలకు చెందిన వేలాది గజాల స్థలాలను కూడా అనేకమంది ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ స్థలాల విలువ కోట్లల్లో ఉంది. నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, మండల ప్రజాపరిషత్, పశుసంవర్ధకశాఖలకు చెందిన ప్రభుత్వ స్థలాలకు కూడా అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ కార్యాలయం పరిధిలోని ఏన్కూరు మండలంలో 1/70 యాక్టు ఉన్నా పార్టీషన్ పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారు.



జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ వీటిపై విచారణ చేసి ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలకు సిఫార్సు చేశారు. సదరు సబ్‌రిజిస్ట్రార్‌ను విధుల నుంచి తొలగిస్తూ వచ్చిన ఉత్తర్వులు ఒక మంత్రి జోక్యంతో రాత్రికిరాత్రే రద్దయ్యాయి. ఆ తర్వాత మరికొంతకాలం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన అధికారి అడ్డగోలుగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి రూ.కోట్లు కూడబెట్టారనే విమర్శలున్నాయి. దాంతో ఆమెకు అండగా నిలిచిన మంత్రికి చిర్రెత్తి ఇక్కడి నుంచి వేరేచోటకు బదిలీ చేశారని తెలుస్తోంది. ఆమె స్థానంలో వచ్చిన రామచంద్రయ్య డిసెంబరు 28న అర్ధరాత్రి వరకు కొణిజర్ల మండలంలోని ఒక వెంచర్‌కు చెందిన 64 డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్లు చేసిన వ్యవహారంలో సస్పెండయ్యారు.

రేపటినుంచి జేఈఈ మెయిన్స్

5 పరీక్షా కేంద్రాలు.. 6 వేల మంది విద్యార్థులు..


కో ఆర్డినేటర్ పార్వతీరెడ్డి

ఖమ్మం ఖానాపురం హవేలి జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఎన్.టి.ఎ. నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత పరీక్షలు బుధవారం నుంచి జరుగుతాయని, ఖమ్మం జిల్లాలో 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేయడం జరిగిందని, సుమారు 6 వేల మంది వరకు హజరుకానున్నారని జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్. పార్వతీ రెడ్డి తెలిపారు. బొమ్మా ఇంజనీరింగ్ కళాశాల, విజయ ఇంజనీరింగ్ కాలేజి, ఎస్.బి.ఐ.టి పాకబండ బజార్, దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, ప్రియదదర్శిని ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. జనవరి 22, 23, 24, 28, 29 తేదీలలో జెయిఇ మెయిన్స్ 30న బీఆర్క్ పరీక్ష నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. .ఈ పరీక్షలు మొదటి షిఫ్ట్ ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు ,రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షాకేంద్రానికి ఒక గంట ముందు చేరుకోవాలని, ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు 2.30గంటలకు పరీక్ష కేంద్రం యొక్క గేట్లు మూసివేస్తారని సూచించారు.

పోటెత్తిన ఎర్ర బంగారం

- మార్కెట్‌కు సుమారు 30 వేల బస్తాల రాక
- ఈ సీజన్‌లో తొలిసారి వెల్లువ



ఖమ్మం మార్కెట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (తేజా రకం కొత్త మిర్చి) పోటెత్తింది. సోమవారం సుమారు 30 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమైనాక తొలిసారిగా పంట ఇంత భారీ మొత్తంలో రావడం ఇదే ప్రధమం. మార్కెట్‌కు శని, ఆదివారాలు రెండు రోజులు వరుసగా సెలవులు ఉన్న నేపధ్యంలో సోమవారం రైతులు పంటను భారీగా అమ్మకానికి తెచ్చారు. మార్కెట్లో ఈనెల 16న సుమారు 25 వేల బస్తాల వరకు రాగా ప్రస్తుతం 30 వేల బస్తాలకు పైగా అమ్మకానికి వచ్చాయి. ఇదిలా ఉండగా మార్కెట్లో క్వింటాలు మిర్చి రూ. 15,300 నిర్ణయించగా నాణ్యతను బట్టి క్వింటాలు రూ. 13 వేల నుంచి రూ.14వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు.

భూ నిర్వాసితులకు రూ.21లక్షల పరిహారం

ఏన్కూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు సీతారామ ప్రాజెక్టు లింకు కెనాల్ భూనిర్వాసితులకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఎకరాకు రూ.21 లక్షల నష్టపరిహారం ప్రకటించినందుకు వైరా ఎమ్మెల్యే రాందాసు నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైరా క్యాంపు కార్యాలయంలో ఏన్కూరు మండల రైతులతో కలిసి సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్టుకు అడిగిన వెంటనే భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వహించి నమస్కారిస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యేక కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఫొటో కొట్టు.. చిట్కా పట్టు..



- పంటల చీడపీడల నివారణకు సాంకేతికత వెన్నుదన్ను
- ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను రూపొందించిన కేంద్రం
- ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు పొందే అవకాశం
- స్మార్ట్ ఫోన్‌తో ఈ-వ్యవసాయం
- తెలుగు భాషలోనూ యాప్ సేవలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విపత్తులకు తోడు చీడపీడలు అన్నదాతల్ని ఏటా ఇబ్బంది పెడుతున్నాయి. చీడపీడల్ని సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో క్షణాల్లోనే సమగ్ర సస్యరక్షణ చర్యలు రైతులకు చేరువయ్యేలా చర్యలు తీసుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందుబాటులోకి తెస్తోంది. చిత్రం తీసి పంపిస్తే చాలు.. క్షణాల్లో సస్యరక్షణ చర్యలను నిపుణులు తెలియజేస్తారు.

రైతులకు కొత్త యాప్

కేంద్ర ప్రభుత్వం జాతీయ చీడపీడల నిఘా వ్యవస్థ మొబైల్ యాప్‌ను నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం (ఎన్‌పీఎస్ఎస్) పేరుతో సిద్ధం చేసింది. కేంద్ర వ్యవసాయశాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్, స్టోరేజి కార్యాలయం, ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సహకారంతో దీనిని రూపకల్పన చేశారు. రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రానికి అప్పగించారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులకు దీనిపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మార్గదర్శకాలు చేశారు.

12 ప్రధాన పంటలకు..

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ సహాయంతో రైతులకు తక్షణమే శాస్త్రీయ పద్ధతిలో సలహా, సేవలు అందించేందుకు ఫొటో రిపోజిటరి సేవల్ని జిల్లాలో వినియోగించనున్నారు. క్రాప్ లైఫ్ సిస్టమ్ యాప్‌లో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న, మినుము, పెసర, శనగ, పత్తి, చెరకు, వేరుసెనగ, ఎర్ర శనగ, ఎండు మిరప, పసుపు వంటి పంటల్ని నమోదు చేస్తారు. వివిధ పంటల దశలు, తెగుళ్ల, (మిగతా 6వ పేజీలో)

సేవలు.. ప్రయోజనాలివీ

యాప్‌లో రైతు పేరు, చరవాణి నంబరు, గ్రామం, పంట, పంట కాలం, దశ, చీడపీడల రకం, ప్రదేశం తదితర వివరాలను నిక్షిప్తం చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు పంటల సమాచారం, సస్యరక్షణ సలహాలు పొందవచ్చు. పంట పేరు నమోదు చేస్తే ఏ పురుగు సోకింది..? తెగుళ్ల ఉన్నాయా..? లక్షణాలు ఎలా ఉంటాయి..? నివారణ చర్యలు ఏం చేపట్టాలో సమగ్ర సమాచారం రైతుకు క్షణాల్లో వస్తుంది. దీనిద్వారా సమయం, ఖర్చు తగ్గించి దిగుబడులు పెంచే అవకాశం ఉంటుంది.

ధ్వంసమా.. మాయమా..?

- రేగళ్లపాడు నర్సరీలో పామాయిల్ మొక్కలపై గందరగోళం
- మాయం చేసి నొక్కేశారని అనుమానాలు
- ఉన్నతాధికారుల సూచనలతోనే ధ్వంసం చేశామంటున్న అధికారులు
- కొనసాగుతున్న విచారణ


పనికి రానివిగా గుర్తించి ధ్వంసం చేసిన పామాయిల్ మొక్కలు

సత్తుపల్లి/అశ్వారావుపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రేగళ్లపాడులో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని పామాయిల్ నర్సరీలో మొక్కల సంఖ్యపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు విత్తనంలోనే లోపం వచ్చిందంటుండగా, మరికొందరు అధికారుల లోపం వల్లే జరిగిందంటున్నారు. నర్సరీలో మొక్కలు సంఖ్యపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయ అధికారులు విచారణకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆయిల్‌ఫెడ్ అధికారుల్లో వర్గపోరువల్లే ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

ఆయిల్‌ఫెడ్ కోస్టారికా నుంచి 2023 జూన్‌లో 3 లక్షల సీడ్ లింక్ దిగుమతి చేసుకొని సత్తుపల్లి మండలం రేగళ్లపాడు ఆయిల్‌ఫెడ్ నర్సరీలో పెంచడం ప్రారంభించారు. ఈ మొక్కల వయస్సు ఇప్పటికి దాదాపుగా 17 నెలలు. వాస్తవంగా 12 నెలలకు 3.5 మీటర్ల ఎత్తు ఎదిగి రైతులకు సరఫరా చేసే విధంగా మొక్క తయారు కావాలి. అయితే 17 నెలలు దాటినా ఇప్పటికి ఈ మొక్కలు కనీస స్థాయిలో కూడా ఎదగలేదు. మూడు లక్షల మొక్కల్లో అసలు పనికి రాకుండా పోయిన 80 వేల మొక్కలను గుర్తించి వాటిని ఎటువంటి అనుమతులు లేకుండా ధ్వంసం చేసినట్టు నర్సరీ ఇన్‌చార్జి, ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారులుపై పలు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయిల్‌ఫెడ్ ప్రధాన (మిగతా 6వ పేజీలో)

గురుకుల పాఠశాల భవనానికి తాళం

- ఇబ్బందులు పడిన విద్యార్థులు
- 9 నెలల అద్దె రూ. 30 లక్షలు పెండింగ్
- 11 నెలలుగా పేరుకుపోయిన కరెంటు బిల్లు రూ.9.5 లక్షలు
- 6 నెలల గడువు కోరడంతో తాళం తీసిన యజమాని


తాళం వేసి ఉన్న దృశ్యం


తాళం వేయడంతో ఆరుబయట విద్యార్థులు

ఖమ్మం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల భవనాన్ని అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. కాగా సంబంధిత కళాశాల యాజమాన్యానికి, సోషల్ వెల్ఫేర్ శాఖకు మధ్య కుదిరిన ఒప్పందం మూడేళ్ల క్రితమే ముగిసింది. అయినప్పటికీ కళాశాల భవనం ఖాళీ చేయకపోవడంతోపాటుగా సంబంధిత యజమాని ఎన్ని లేఖలు రాసినా అధికారులు స్పందించలేదు. అంతేకాదు భవనానికి సంబంధించిన తొమ్మిది నెలల అద్దె సుమారు రూ. 30 లక్షలు, పదకొండు నెలలుగా కరెంటు బిల్లు రూ. 9.5 లక్షలు చెల్లించడం లేదు. అధికారులు (మిగతా 6వ పేజీలో)

భవనాలు, వెంచర్లకూ రైతుబంధు ఇచ్చేశారు..!

- మండలంలో రైతు భరోసా సర్వే పూర్తి
- 241.25 ఎకరాలు అనర్హత భూమిగా గుర్తింపు

అశ్వారావుపేట/రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట పట్టణం చుట్టుపక్కల వ్యవసాయేతర భూములకు పెద్ద ఎత్తున రైతుబంధు పథకం కింద ఆరేళ్లపాటు చెల్లింపులు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో లేఅవుట్లుగా మారిన వ్యవసాయ భూములకు, వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్న స్థలాలకు కూడా రైతుబంధు సాయం అందింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26నుంచి రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీనికి లబ్ధిదారుల గుర్తింపుకు సంబంధించి మండలంలో అధికారులు సర్వేను పూర్తిచేశారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయం చేయని భూములకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, వాణిజ్య సముదాయాలుగా మారిన భూములకు ఇచ్చిన రైతుబంధు వివరాలపై తిరిగి సర్వేను చేయించింది.



సర్వే చేస్తున్న రెవెన్యూ వ్యవసాయ అధికారులు

రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా మండలంలో నాలుగు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో సర్వేను పూర్తి చేశారు. గతంలో రైతుబంధు తీసుకున్న భూములకు సంబంధించి సర్వే నెంబర్లు, సబ్ డివిజన్ల వారీగా ప్రస్తుతం భూములు సాగు చేయబడుతున్నాయా? లేదా? సాగుకు యోగ్యం కాని భూములు ఉన్నాయా? అనే దానితోపాటు పలు అంశాలపై సర్వే చేశారు.

సాగు చేయకున్నా.. ఏళ్లుగా రైతుబంధు

గత ప్రభుత్వం 2018మే నెలలో రైతుబంధు పథకాన్ని ప్రారంభించింది. అప్పట్లో ఎకరానికి రూ.4వేల చొప్పున పెట్టుబడి సాయం అందించారు. అదే ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరువాత పెట్టుబడి సాయాన్ని పెంచారు. ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు విడతల్లో ఏడాదికి రూ.10 వేల చొప్పున సాయం అందించారు. ధరణి పోర్టల్‌లో పట్టా పాసుపుస్తకం ఉన్న రైతులందరికీ ఈ పథకాన్ని అమలు చేశారు. అప్పట్లో భూములు సాగు చేస్తున్నారా? లేదా? అనేది ఏమీ లేకుండానే పట్టా పాసుపుస్తకాల ఆధారంగా రైతుబంధు నగదును బ్యాంకుల్లో రెండు విడతల్లో జమ చేశారు. ప్రస్తుతం అర్హతలేని భూములకు ఏళ్లుగా పెట్టుబడి సాయం అందుతూనే ఉంది.

241.25 ఎకరాలు అనర్హత భూమిగా గుర్తింపు

మండలంలో 19రెవెన్యూ గ్రామాల్లో గల 30 పంచాయతీల్లో అన్ని సర్వే నెంబర్లకు సంబంధించి 37076.14 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి 204 సబ్ డివిజన్లలో ఇళ్ల స్థలాలు, కాలనీల కోసం కేటాయించిన భూమి 37.13 ఎకరాలు, రియల్ ఎస్టేట్, రహదారులు, పరిశ్రమలు, గోదాముల నిర్మాణం, ఇతర నిర్మాణాలకు సంబంధించి 204.1 ఎకరాల భూమిని గుర్తించారు. 37076.14ఎకరాల భూమిలో మొత్తం 241.25 ఎకరాల భూమి రైతు భరోసాకు అర్హతలేనిదిగా గుర్తించారు. ఒక్క అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలోనే 175.11 ఎకరాల భూమి అర్హతలేని భూమిగా గుర్తించారు. వినాయకపురం, ఆసుపాకలో 25.18 ఎకరాల భూమికి అర్హతలేకపోయినా రైతుబంధు పొందినట్లుగా గుర్తించారు. దీనికి రైతు భరోసా వర్తించదని అధికారులు నివేదికలో పొందుపరిచారు. భవిష్యత్తులో ఈ భూమికి రైతుభరోసా నిధులు నిలిచిపోనున్నాయి. సర్వే వివరాలను జిల్లా అధికారులకు పంపనున్నట్టు ఏవో శివరామప్రసాద్ తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యల కోసం జిల్లా అధికారుల వద్దకు వస్తున్నారని, ఆయా శాఖల అధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అరుణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదులు ఇలా..

- చింతకాని మండలం, మత్కేపల్లి నామవరానికి చెందిన చిలక సైదులు, తనకు గల సర్వే నెం.371, 383, 386/ఇ, 387/ఇ2, 388/ఇ2, 293/ఏ, 297 లోని భూమికి విలువ ధ్రువీకరణ పత్రం ఇవ్వవల్సిందిగా కోరారు.
- వేంసూరు గ్రామం నుండి బింగి సత్యనారాయణ, తనకు సర్వే నెం. 103/1/10లో గల భూమిని రెవెన్యూ అధికారులు పొరపాటున మరొకరి పేరున నమోదుచేసి, పాస్‌పుస్తకం జారీచేశారని, విచారించి న్యాయం చేయాలని విన్నవించుకున్నారు.
- కల్లూరు మండలం ఎర్రబోయినపల్లె నుంచి పొట్రు భారతమ్మ, తన కుమారులు తన 3 ఎకరాల భూమి తీసుకొని, తనను చూడకుండా గెంటివేశారని, పొలాన్ని తనకు ఇప్పించాలని కోరింది.
- కొణిజర్ల మండలం గోపవరం గ్రామం నుంచి మార్కాపుడి సుమలత, తాను బి.టెక్. చదువుకొని, నిరుద్యోగిగా ఇంటి వద్ద ఉన్నట్లు, అవుట్ సోర్సింగ్‌లో ఉపాధి కల్పించాలని మొరపెట్టుకుంది.
- ఏన్కూరు మండలం గార్లఒడ్డు గ్రామం నుంచి కొర్ర సీత, తనకు తల్లాడ మండలం గోపాల్‌పేటలో గల సర్వే నెం.241/ఈ/1 గల భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించి, కొత్త పాస్‌పుస్తకాన్ని మంజూరుచేయాలని కలెక్టర్‌ను వేడుకుంది.

దేవస్థానంలో అంతర్గత బదిలీలు

సీసీ శ్రీనివాసరెడ్డికి ఆలయ ప్రొటోకాల్ బాధ్యత

భద్రాచలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి దేవస్థానంలో ఉద్యోగులకు సోమవారం అంతర్గత బదిలీలను చేస్తూ దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంటు, సీసీ టు ఈవోగా ఉన్న కె.శ్రీనివాసరెడ్డికి ఆలయానికి సంబంధించి పూర్తి పర్యవేక్షణ, ప్రొటోకాల్, గోశాల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. సీనియర్ అసిస్టెంటు బాలాజీకి ప్రసాదాల తయారీ విభాగం ఇన్‌చార్జితోపాటు అన్నదానం ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే సీనియర్ అసిస్టెంటు ఎం.కృష్ణస్వామికి జనరల్, ట్రస్టు బోర్డు, ఆర్టీఐ, సీఆర్‌వో, కల్యాణ కట్ట, శానిటరీ ఇన్‌స్పెక్టర్(ఇన్‌చార్జి)గా బాధ్యతలు అప్పగించారు. అలాగే జూనియర్ అసిస్టెంట్లు ఎం.స్వర్ణకుమారికి అకౌంటెంట్, అవుట్‌సోర్సింగ్, ప్రైవేటు సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించారు. అలాగే టి.రాకేష్‌కు సీసీ టూఈవో-2(ఆఫీసు), ఎస్టాబ్లిష్‌మెంటు వాహనాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. బి.సుష్మకు సెంట్రల్ స్టోర్స్ గుమ్మస్తా, టీకేవీవీఎస్ శ్రీనివాసరావుకు క్యాషియర్, ఆగారెడ్డికి రికార్డు రూం, డిస్పాచ్ విభాగం, కుమారికి పోస్టు ఆడిట్, వార్షికోత్సవాలు, మేజర్ ఫెస్టివల్స్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. నలుగురు అటెండర్లకు నూతన బాధ్యతలు అప్పగించారు.

దమ్మపేటలో సినీనటుడు సుబ్బరాయశర్మ సందడి

దమ్మపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు సుబ్బరాయశర్మ సోమవారం దమ్మపేటలో సందడి చేశారు. రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు సదాశివరావుకు క్యారెక్టర్ ఆర్టిస్టు సుబ్బరాయశర్మ సోదరుడు కావటంతో సంక్రాంతి సందర్భంగా మందలపల్లిలోని ఆయన నివాసానికి వచ్చి ఆత్మీయంగా కలిశారు. ఆయన దమ్మపేట శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించగా ఆలయకమిటీ సభ్యులు, అర్చకులు ఆయనను సత్కరించి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. సంక్రాంతి పండుగను బంధువులతో పంచుకునేందుకు వచ్చానని బంధువులతోపాటు గ్రామస్థుల అభిమానాన్ని పొందటం సంతోషంగా ఉందన్నారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా 300లకు పైగా సినిమాల్లో నటించానని ప్రస్తుతం మరికొన్ని సినిమాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. జంధ్యాలతో కలిసి నాటకాలలో నటించానని ఆయన ప్రోత్సాహంతో సినిమాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. సుబ్బరాయశర్మను సత్కరించిన వారిలో మాజీ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, యువకులు ఉన్నారు.



సుబ్బరాయశర్మను సత్కరిస్తున్న దృశ్యం

నేటి నుంచి విలాసోత్సవాలు

- రామదాసు మండపంలో రాపత్తు సేవ
- ముగిసిన అధ్యయనోత్సవాలు

భద్రాచలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో విలాసోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. కాగా భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాపత్తు సేవల్లో భాగంగా సోమవారం యూబీ రోడ్డులోని రామదాసు మండపంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్వామివారికి రాపత్తు సేవ నిర్వహించారు. ముందుగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్వామివారిని ఆలయం నుంచి మండపం వద్దకు మేళతాళాలు, భాజభజంత్రీల నడుమ తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు తహసీల్దారు శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. అలాగే భక్తులు సైతం దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విద్యార్థులకు వరం ఇగ్నో విశ్వవిద్యాలయం

రీజనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బొల్లం రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వరం ఇగ్నో విశ్వవిద్యాలయం అని రీజనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బొల్లం రాజు అన్నారు. సోమవారం కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ ప్రాముఖ్యత, విధి విధానాలను గూర్చి విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దేశంలోనే అనేక కోర్సులలో అత్యధిక స్థాయిలో విద్యార్థులు నమోదు చేసుకొని విద్యను అభ్యసిస్తున్న ఏకైక విశ్వ విద్యాలయం ఇగ్నో అని కొనియాడారు. విద్యార్థులకు అందించే స్టడీ మెటీరియల్ అత్యున్నతమైనదని, సివిల్స్‌స్థాయికి తగ్గ పాఠ్య ప్రణాళిక అంశాలు ఇగ్నో సొంతమని తెలిపారు. ఒకే విద్యా సంవత్సరంలో ఒక రెగ్యులర్ కోర్సుతోపాటు దూర విద్య విధానంలో ఆన్‌లైన్‌లో మరొక కోర్సు సైతం అభ్యసించే అవకాశం విద్యార్థినులకు అందించటంలో ఇగ్నో ముందంజలో ఉందని గుర్తుచేశారు. విస్తృతమైన సాంకేతిక విద్యా నైపుణ్యాలను మెరుగు పరిచే శిక్షణను ఇగ్నో అందిస్తుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కళాశాల కరెస్పాండెంట్ సునీల్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన పోలీసు క్రీడలు



బ్యాటింగ్ చేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోలీసుపరేడ్ మైదానంలో పోలీసు సిబ్బందికి నిర్వహిస్తున్న క్రీడాపోటీలు సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. క్రికెట్‌లో పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అద్భుత బౌలింగ్‌తో 5 వికెట్లు పడగొట్టారు. తర్వాత బ్యాటింగ్‌లో రాణించి ఆల్‌రౌండర్‌గా రాణించారు. అథ్లెటిక్స్ పోటీలు 800 మీటర్ల పురుషుల పరుగు, వంద మీటర్ల మహిళల పరుగుపందేలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు సిబ్బంది ప్రతిభ చాటారు.

ధ్వంసమా.. మాయమా..?

(5వ పేజీ తరువాయి)

కార్యాలయం నుంచి నర్సరీలో మొక్కల సంఖ్యలో తేడా, ధ్వంసం చేసిన మొక్కల పరిస్థితిపై విచారణకోసం ప్రవీణ్‌కుమార్ అనే అధికారిని పంపారు. ఈయన ఈనెల 10వ తేదీన నర్సరీని పరిశీలించి మొత్తం రికార్డులను పరిశీలించి నివేదికను తయారు చేసినట్టు సమాచారం. ఇదిలా ఉండగా 80 వేల మొక్కలను అనుమతుల్లేకుండా ధ్వంసం చేశారని, ఆ రూపంలో ఆ మొక్కలను మాయం చేశారనే ప్రచారం సాగుతోంది. కొంత మంది అధికారులు మాత్రం ఆరోపణల్లో నిజంలేదని ఈ కన్‌సైన్‌మెంట్‌లో వచ్చిన మూడు లక్షల విత్తనాలపై మొదటి నుంచి అనుమానాలున్నాయని, మొదటి నుంచి ప్రతి నెల ప్రధాన కార్యాలయానికి మొక్కలపై రిపోర్టులు పంపుతూనే ఉన్నామని, ఆయిల్‌ఫెడ్ సీనియర్ టెక్నికల్ అధికారి నర్సరీని పరిశీలించి పనికిరావని గుర్తించిన 80 వేల మొక్కలను ధ్వంసం చేయాలనే సూచనలతోనే వాటిని ధ్వంసం చేశామని, ఇదంతా ప్రధాన కార్యాలయం అధికారులకు తెలుసునని, కావాలనే ఎవరో మధ్యలో దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ బ్యాచ్‌లో ఒక్క మొక్క కూడా రైతులకు సరఫరా కాలేదని చెపుతుండటం అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పనికిరాకుండా పోయిన 3 లక్షల సీడ్ లింక్

2023 జూన్‌లో సరఫరా అయిన మూడు లక్షల సీడ్ లింక్ పనికిరాకుండా పోయింది. 17 నెలలు గడిచిన ఎదుగుదల లేకుండా పోయింది. వీటిని రైతులకు సరఫరా చేసి ఉంటే రైతులు భారీ నష్టపోయి ఉండేవారనేది మరో వాదన. అయితే నాసిరకం సీడ్‌లింక్ దిగుమతి, వాటి పెంపకం కోసం ఆయిల్‌ఫెడ్ లక్షలాది రూపాయలు వెచ్చించింది. ఈ మేరకు ఆయిల్‌ఫెడ్‌కు నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా ఈ మొత్తం వ్యవహారంలో రూ.80 వేలు మొక్కలు మాయం అయ్యాయని ఒకవైపు, లేదు కల్లింగ్ ప్లాంట్‌లుగ గుర్తించి ధ్వంసం చేశామని మరోరకమైన వాదనలు వినిపిస్తున్నాయి. ఈ గందరగోళం వెనుక అధికారుల్లో వర్గపోరువల్లే జరుగుతుందనే ప్రచారం మరో వైపు జరుగుతోంది. పూర్తిస్థాయి విచారణ జరిగితే కాని అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి. దీనిపై ఆయిల్‌ఫెడ్ ఉమ్మడి జిల్లా అధికారి బాలకృష్ణను వివరణ కోరగా 2023 జూన్‌లో వచ్చిన మూడు లక్షల సీడ్‌లింక్స్‌లో లోపాలున్నట్టు ముందుగానే గుర్తించామన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు రిపోర్టు చేశామని, ఆ బ్యాచ్‌లో ఒక్క మొక్కను కూడా ఇప్పటి వరకు రైతులకు సరఫరా చేయలేదన్నారు. సాంకేతిక సలహా అధికారుల సూచనలమేరకు 80వేల మొక్కలను ధ్వంసం చేశామని అన్నారు. దీనిపై ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ వివరణకోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కన్న కూతురునే చంపాలని..



టేకులపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): భార్య, భర్తల గొడవల్లో కన్న కూతురునే కడతేర్చాలని ఓ తండ్రి ప్రయత్నించిన ఘటన మండలంలోని సంపత్‌నగర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోడు పోలీసులు తెలుపిన వివరాల ప్రకారం.. సంపత్‌నగర్ గ్రామానికి చెందిన కొర్స రవి, లక్ష్మి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్య, భర్త గొడవలు పడుతున్నారు. గ్రామంలో పంచాయతీలు కూడా నిర్వహించి కలిసి ఉండే విధంగా చేశారు. సంక్రాంతి పండుగకు ముందు తిరిగి వారిద్దరు గొడవపడి భర్త రవి ఇంటినుంచి బయటకు వెళ్లి పోయాడు. పండుగ రోజున ఈనెల 13న తిరిగి ఇంటికి వచ్చిన రవి తన ఎనిమిదేళ్ల మూడో కూతురు సాహిత్యను జమాయిల్ తోటకు తీసుకెళ్లి తన వద్ద ఉన్న కండువాతో ఆమె మెడను నులిపాడు. పాప స్పృహ కోల్పోవడంతో చనిపోయిందని భావించి అక్కడి నుంచి ఉడాయించాడు. స్పృహలోకి వచ్చిన సాహిత్య ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లికి తెలిపింది. సోమవారం బాలిక సాహిత్య తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు బోడు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన మార్కెట్ కమిటీ

ఖమ్మంమార్కెట్,జనవరి20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్‌ఛైర్మన్ తల్లాడ రమేష్‌తోపాటు డైరెక్టర్లు బోజోత్ రమేష్, రెంటాల ప్రసాద్, వడ్లమూడి శైలజ,వెనిగళ్ళ బాబూరావు, షేక్ లతీఫ్, తమ్మిన్ని నాగేశ్వరరావు, అంగడాల నరసింహరావు, చెరుకూరి శీతరాములు, ఆంగోత్ చిట్టిబాబు, బాణోత్ భీమానాయక్, మొర్రిమేకల నాగేశ్వరరావు, బోజెడ్ల సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కార్పొరేటర్ కమర్తపు మొరళి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని క్రిష్టారావు, సెక్రెటరీ మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు జీవై నరేష్, జాయింట్ సెక్రెటరీ మన్నెం క్రిష్ణ, దిగుమతి శాఖ అధ్యక్ష, కార్యధర్శులు దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పలరావు, మిర్చి శాఖ అధ్యక్ష, కార్యధర్శులు మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్, కార్మికసంఘం నాయకుడు నున్నామాధవరావు తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ గ్రేడ్‌టూ సెక్రెటరీశ్రజన్‌బాబు,అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మార్కెట్ చైర్మన్ హన్మంతరావు, వైస్ చైర్మన్ రమేష్

గురుకుల పాఠశాల భవనానికి తాళం

(5వ పేజీ తరువాయి)

స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన సదరు కళాశాల యజమాని సంక్రాంతి సమయంలో ఆ భవనానికి తాళాలు వేశారు. సంక్రాంతి సెలవులు ముగియడంతో విద్యార్థులందరూ తిరిగి పాఠశాలకు చెరుకున్న సమయంలో తాళాలు వేయడంతో వారు భవనానికి సంబంధించిన కింద ఫ్లోర్‌లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా సోమవారం రోజున విద్యార్థులు సెలవులు ముగించుకుని ఎక్కువ సంఖ్యలో తిరిగి పాఠశాలకు హాజరయ్యారు. దాంతో సమస్య పెద్దదిగా మారింది. దాంతో జోనల్ అధికారి స్వరూపారాణి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆరు నెలల పాటు సమయం ఇవ్వాలని యజమానికి సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఫొటో కొట్టు .. చిట్కా పట్టు

(5వ పేజీ తరువాయి)

చీడపురుగులు వాటిద్వారా నాశనం చేయబడిన మొక్క భాగాల ఫొటోలు తీసేందుకు వీలు కల్పించారు. ఈ-పంట నమోదు చేస్తున్న అందరికీ సస్యరక్షణ చర్యల్ని పొందే అవకాశమిచ్చారు.

స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు..

అన్నదాతల్లో ఎక్కువమంది వద్ద స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉండటంతో వారు ఈ యాప్‌ను వినియోగిస్తే త్వరితగతిన చీడపీడలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. తెలుగు భాషలోనూ ఈ యాప్ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయాధికారులు సిద్ధమవుతున్నారు.

లారీల వ్యాపారి ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన పంచకర్ల వీరాంజనేయులు మరియు అతడి భార్య పంచకర్ల దుర్గాప్రసన్న ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.91లక్ష 35వేలకు దివాలా పిటిషన్ దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లా వలపర్తిపాడు గ్రామానికి చెందిన దుర్గాప్రసన్న మొదట లారీ డ్రైవర్‌గా పని చేస్తూ తరువాత లారీలు కార్లను కొని అమ్మేవాడు. దానితోపాటు లారీ ట్రాన్స్పోర్ట్ వ్యాపారం నిర్వహించాడు. వ్యాపార అభివృద్ధికి మొత్తం 51మంది వద్ద రుణాలు తీసుకున్నాడు. వ్యాపార అభివృద్ధి కుంటుపడడం, రుణదాతల ఒత్తిడి అధికమవడంతో తన స్వగ్రామం నుంచి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం ప్రాంతంలో ఉంటున్నాడు. ఇటీవల రుణ దాతల వత్తిడి అధికం కావటంతో తమన్యాయవాదులు ముvvా నాగేశ్వరావు, దేవకి శ్రీనివాసరావు గుప్త,మరియు నోముల వాసవి దేవి ద్వారా దివాలా పిటిషన్ దాఖలు చేశారు

పథకాల పేరిట దందా..



- రంగంలోకి దిగిన దళారులు
- రూ. లక్షల్లో వసూళ్లకు ప్రణాళిక..
- గతంతోనూ మోసపోయిన బాధితులు

కొత్తగూడెం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఏ పార్టీ ఉన్నా సరే.. ప్రభుత్వం కొత్తపథకం అమలుకు శ్రీకారం చుట్టిందంటే చాలు.. కొందరి పంటపండినట్లే. దరఖాస్తుల స్వీకరణ మొదలునుంచే ఆశావాహులను ఆకర్షించే ప్రయత్నాలు ప్రారంభిస్తుంటారు. వారు ప్రభుత్వ ఉద్యోగం చేయడం లేదు. ఆదాయమార్గాలు కూడా లేవు. రాజకీయాల్లో చిన్నాచితక పనులు చేసుకుంటూ తిరుగుతుంటారు. నిత్యం ప్రజలదృష్టిని ఆకర్షించేందుకు, దర్పం ప్రదర్శించేందుకు దర్జాగా హంగు,ఆర్భాటాలు ప్రదర్శిస్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో దిగిన ఫొటోలతో పరిచయాలు ఉన్నాయని సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటూ తమకున్న పరిచయాలను ఆదాయమార్గాలుగా మార్చుకుంటున్నారు. అమాయకప్రజలు వారి మాటలకు ఆకర్షితులై ప్రభుత్వపథకాల్లో లబ్ధిపొందాలని లక్షలు సమర్పించి మోసపోతున్నారు.

జిల్లాకలెక్టర్ దళారులను ఆశ్రయించవద్దని సూచించినా.. ప్రచారానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వహయంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళితబంధు, కార్పొరేషన్ లోన్లు, ఇతరాత్ర పథకాల కోసం చోటా,మోటా,బడా నాయకులు లబ్ధిదారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కొంతమంది ప్రజాప్రతినిధులు డబ్బులు వసూలు చేసిన తర్వాత పథకాల లబ్ధి దరిచేరక పోవడంతో బాధితులు గోడవలకు దిగారు. పరువు పోవడంతో పాటు రాజకీయభవిష్యత్ ఉండదనే భయంతో కొంతమంది వెంటనే బాధితులకు వారి నుంచి వసూలుచేసిన డబ్బులను గుట్టుచప్పుడు కాకుండా ముట్టజెప్పిన ఘటనలు జిల్లాలో కొకోల్లలు.

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపికప్రక్రియ ఇంటింటి సర్వే సోమవారంతో ముగిసింది. అధికారులు అర్హుల ఎంపికలో తలమునకలై ఉండగా. దళారులు వసూళ్లకు తెరలేపారు.

ప్రభుత లబ్ధిపొందాలనే వారిని గుర్తించి వారి ఆశలను వీరంతా సొమ్ము చేసుకుంటున్నారు. ఏ పథకం దరిచేరాలన్నా రేషన్‌కార్డు ప్రామాణికంగా ఉండటంతో జిల్లా లో రేషన్‌కార్డులు కోసం చాలామంది అర్హులు, అనర్హులు దరఖాస్తు చేసుకున్నారు. కొంతమంది ఆర్థికంగా ఉన్నవారికి సైతం రేషన్‌కార్డులు ఇప్పిస్తామని రూ.10నుంచి రూ. 50వేల వరకు వసూలు చేస్తున్నారు. నేటినుంచి జరగనున్న, వార్డు, గ్రామసభలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో దృష్టిసారిస్తే అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఆవుకు పుట్టినరోజు వేడుకలు

చింతకాని, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు లింగేశ్వరరావు చూడితో ఉన్న ఆవుకు పుట్టినరోజు, సీమంతం నిర్వహించారు. రైతు లింగేశ్వర్‌రావుకు చెందిన ఆవు 9నెలల చూడితో ఉంది. రైతు కుటుంబీకులు ఆవుకు పసుపు రాసి కుంకుమ బొట్లు చీర, సారె పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆవుకు స్వీట్లు, పళ్ల తినిపించారు. ఒంగోలు జాతికి చెందిన ఈ ఆవు దూడగా ఉన్న సమయంలో ఊర్వశి అని నామకరణం చేశారు.

సైన్స్ పరికరాలు, పుస్తకాల వితరణ

జూలూరుపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జూలూరుపాడు ఉన్నత పాఠశాలకు యల్లంకి కళ్యాణి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సైన్స్ పరికరాలతో పాటు పుస్తకాలు బాలికలకు పలు సామగ్రిని సోమవారం అందజేశారు. వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన బాలికలకు ట్రస్ట్ చైర్మన్ యల్లంకి రమేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యల్లంకి సత్యానారయణ బహుమతులను అందజేశారు. రూ. 10వేల విలువచేసే సైన్స్ పరికరాలు, 10వ తరగతి విద్యార్థినిలకు అల్‌ఇన్‌వన్‌లతో పాటు బాలికలకు శానిటరిప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.

సీసీరోడ్ల పేరుతో ఇసుక వ్యాపారం

- పైనంపల్లి వద్ద ఏట్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో రవాణా
- రామచంద్రాపురం శివారులో జేసీబీతో ఇసుక లోడింగ్
- చోద్యం చూస్తున్న అధికారులు




జేసీబీతో ఇసుకను లాట్లు చేస్తున్న దృశ్యం, ట్రాక్టర్‌లో లోడు చేసిన ఇసుక

నేలకొండపల్లి, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద పాలేరు ఏట్లో ఇసుకను అక్రమార్కులు ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. అడ్డూ, అదుపూ లేకుండా నిత్యం వందల ట్రిప్పులు ఇసుక అక్రమంగా. ఎటువంటి అనుమతులు లేకుండా తరలిపోతోంది. ఐనప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప పట్టించుకుంటున్న పాపాన పోవటం లేదు. ఏట్లో జేసీబీని పెట్టి మరీ లోడింగ్ చేస్తున్నప్పటికీ అధికారులు కళ్లు మూసుకున్నారు. పైనంపల్లి మీదినుంచి వెళ్లె పాలేరు ఏట్లో ఇసుకను తరలించటానికి ప్రభుత్వం ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అయినప్పటికీ చుట్టు పక్కల గ్రామాల వారు వివిధ కారణాలతో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుంటారు. ఈ అవకాశాన్ని తీసుకుని కొందరు ఇసుక వ్యాపారాన్ని ప్రారంభించారు. సమీపంలోని ప్రాంతాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.మూడు నుంచి ఐదు వేలకు అమ్ముతున్నారు.

భారీగా ఇసుక అక్రమ రవాణా

రామచంద్రాపురం, సుర్దేపల్లి, బోదులబండ గ్రామాలకు చెందిన కొంత మంది సిండికేట్‌గా ఏర్పడి కొన్నిరోజులుగా పెద్ద మొత్తంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అదేమంటే సీసీరోడ్లకంటూ బొంకుతున్నారు. సీసీ రోడ్లకైనా కాంట్రాక్టరు ఇసుకను ఎక్కడి నుంచి తెచ్చుకోవాలో అధికారులు వర్క్‌ఆర్డర్‌లో పొందు పరుస్తారు. కానీ ఇతరత్రా ప్రభుత్వ పనులకంటూ ఇసుకను భారీఎత్తున అక్రమంగా తరలిస్తున్నారు. సీసీరోడ్లకు ఇతరత్రా పనులకైతే మండల అధికారుల నుంచి అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అటువంటిదేమీ లేకుండానే తరలిస్తున్నారు. పైనంపల్లి ఏటినుంచి మాత్రం ఇసుకను తరలించటానికి ఎటువంటి అనుమతులు ప్రభుత్వం నుంచి లేవు.

జేసీబీతో లోడింగ్

రామచంద్రాపురం శివారులో ఏటిలో జేసీబీతో ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం దాదాపుగా 10నుంచి15 ట్రాక్టర్లు రేయింబవళ్లు ఇసుకను తరలించే పనిలోనే ఉంటున్నారు. రోజుకు కనీసంగా 200 వరకు ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత భారీగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకున్నట్లుగా లేదు. అధికారులు ఎందుకు దృష్టి సారించటం లేదో అర్థం కాని సమస్య.

లెక్క తేలుతున్న సాగు భూములు

సత్తుపల్లి నియోజకవర్గంలో సాగుకు యోగ్యం కాని భూమి 810 ఎకరాలు

నేటినుంచి జరగనున్న గ్రామసభల్లో ప్రకటించనున్న అధికారులు

సత్తుపల్లి,జనవరి20(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసాకు సంబంధించి వ్యవసాయ భూముల సర్వే అధికారులు పూర్తి చేశారు. మూడు రోజుల పాటు గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. గత ప్రభుత్వంలో అనర్హులకు కూడా రైతుబంధు జమ అయినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయయోగ్యం కాని భూములకు రైతు భరోసా నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి వ్యవసాయ యోగ్యం కాని భూముల నివేదికను రూపొందించారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో ఇలా....

సత్తుపల్లి నియోజకవర్గంలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో మొత్తం 810.12 ఎకరాల భూమి వ్యవసాయ యోగ్యం కానిదిగా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇళ్ల స్థలాలు, గుట్టలు ఇతర సాగు యోగ్యం కాని భూముల జాబితా తయారు చేశారు. సత్తుపల్లి మండలంలో గతంలో 32,777 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి రైతుబంధు జమ కాగా దీనిలో ప్రస్తుతం 181.12 ఎకరాల భూమి సాగు యోగ్యం కాదని అధికారులు సర్వేలో తేల్చారు. వేంసూరు మండలంలో గతంలో 40,280 ఎకరాలకు రైతుబంధు ఇవ్వగా ప్రస్తుతం 16 ఎకరాలు, పెనుబల్లి మండలంలో గతంలో 39,086 ఎకరాలకు రైతుబంధు జమకాగా ప్రస్తుత సర్వేలో 119.20 ఎకరాలు వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించారు. కల్లూరు మండలంలో 43,753 ఎకరాలకు గతంలో రైతుబంధు జమ అయింది. ఈ మండలంలో ప్రస్తుతం 315 ఎకరాలు, తల్లాడ మండలంలో గత ఏడాది 37,523 ఎకరాలకు రైతుబంధు రాగా ప్రస్తుతం 178.20 ఎకరాల విస్తీర్ణం వ్యవసాయ యోగ్యం కాని భూములుగా నిర్ధారించారు. అధికారులు గుర్తించిన భూములను మంగళవారం నుంచి జరగనున్న గ్రామ సభల్లో ప్రకటించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే పరిశీలించనున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రేవతి సెంటర్ చెందిన వడ్డెటి నరసింహారావుకు చెల్లని చెక్కు కేసులో ఆరు నెలలు జైలు శిక్షతోపాటు ఫిర్యాదుకి నష్టపరిహారం కింద రూ.10లక్షలు చెల్లించాలని ఖమ్మంమూడోఅదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి వినుకొండ మాధవి సోమవారం చెప్పారు. తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన కోళ్ల కృష్ణారావువద్ద నిందితుడు కుటుంబ అవసరాల నిమిత్తం 2015లో రూ.10లక్షలు అప్పుగా తీసుకున్నాడు. రుణం చెల్లించమని ఒత్తిడిచేయగా రూ.10లక్షలకు చెక్కు జారీ చేశాడు. బ్యాంకులో ఇది తిరస్కరణకు గురైంది. దీంతో కోర్టులు కేసు నమోదు చేయగా, పైవిధంగా తీర్పు చెప్పారు.

అసభ్య ప్రవర్తనకు 6 నెలల జైలు

తిరుమలాయపాలెం మండలం, కాకరవాయి గ్రామానికి చెందిన నిందితుడు వీరబోయిన మధు 2023లో ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు నిందితుడిపై కేసునమోదు చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప నేరం రుజువు కావటంతో 6నెలలు జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు.

కబ్జాదారుడి నుంచి స్మశానానికి విముక్తి

- 400 గజాల సంరక్షణ
- హద్దులు ప్రకటించిన కేఎంసీ

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): మరణించిన తర్వాత కావాల్సింది ఆరు అడుగుల స్థలమే.. అటువంటి స్మశాన వాటికిలపై అక్రమార్కులు కన్ను పడి వాటిని ఆక్రమించారు. మూడు నెలలు పోరాటం చేసిన స్మశాన వాటిక సంరక్షణ కమిటీ చివరకు విజయం సాధించింది. ఖమ్మం బైపాస్ రోడ్డులోని టేకులపల్లి స్మశాన వాటికి ఎంతో పూరాతనమైనది. సమీపంలోని 7డివిజన్ల ప్రజలు ఇదే స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేవారు. అయితే ఓ వ్యక్తి స్మశాన వాటికలోని 400 గజాలకు పైగా స్థలాన్ని గత ప్రభుత్వంలో అక్రమించాడు. నిర్మాణాలు చేపట్టి దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇదే ప్రాంతానికి చెందిన కాంగ్రెస్, సీపీఎం, ఇతర రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో స్మశాన వాటిక సంరక్షణ కమిటీగా ఏర్పడ్డారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ప్రజావాణాలో పలు మార్లు ఫిర్యాదులు చేశారు. కేఎంసీ, పోలీసు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సమస్యను వివరించారు. దీంతో సోమవారం స్మశాన వాటికను పూర్తి స్థాయిలో హద్దులు ఏర్పాటు చేసి కేఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు స్మశాన వాటిక పరిరక్షణ కమిటీకి అప్పగించటంతో సరిహద్దురాళ్లు నిర్మాణం చేశారు. కమిటీ సభ్యులు సహకరించిన కేఎంసీ, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



స్మశాన వాటికకు హద్దు రాళ్లు పాతుతున్న స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ సభ్యులు

సబ్‌స్టేషన్ల సామర్థ్యాల పెంపు

- రానున్న వేసవి నేపథ్యంలో చర్యలు
- ఐదుమెగా వాట్ల స్థానంలో.. 8మెగా వాట్లుగా ఏర్పాటు
- రూ.2.13 కోట్లతో అర్బన్ విద్యుత్ కేంద్రాల ఆధునికీకరణ
- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో నేపథ్యంలో విద్యుత్ డిమాండ్‌కు తగిన స్థాయిలో విద్యుత్ ఉపకేంద్రాల సామర్థ్యాలను పెంపుదల చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ తెలిపారు.ఈ నేపథ్యంలో ఖమ్మంలో పలు విద్యుత్ సబ్‌స్టేషను పెంచుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం కార్యాచరణ రూపొందించామని చెప్పారు. సోమవారం ఖమ్మం అర్బన్ ఆరోగ్య ఉపకేంద్రంలో రూ.2కోట్ల13 లక్షలతో నిర్మాణం చేసిన ఐదుమెగా వాట్స్ నుంచి 8 మెగావాట్స్ నిర్మాణ పనులను పూర్తి చేశారు. ధంసలాపురం విద్యుత్ ఉపకేంద్రంలో రూ.1కోటి 60 లక్షలతో 8మెగావాట్స్ సామర్థ్యాన్ని 12.5 మెగావాట్స్‌కు నిర్మాణం పనులను ఎస్ఈ సురేందర్ పరిశీలించి పెంచిన సామర్థ్యాలను ప్రారంభించారు. సకాలంలో పనులు పూర్తి కావటంతో హర్షం వ్యక్తం చేశారు. డీఈలు రామారావు, బాబురావు, బద్రుపవర్, ఏడీఈ యాదగిరి, ఎంఆర్‌టీ సిబ్బంది, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బంది, అధికారులతో ఎస్ఈ సురేందర్

ప్రభుత్వ విధులకు ఆటంకం

మూడు నెలలు జైలు శిక్ష

ఖమ్మంలీగల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం తిమ్మినేనిపాలెంగ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ నబీ అలియాస్ అబ్దుల్లా, ఆళ్ల శ్రీనివాసరావు అలియాస్ శ్రీను, తాళ్ళూరి రాంబాబురాంబాబులకు మూడు నెలలు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు జరిమానా విధించారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించటంతో ఖమ్మం రెండవ అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరిబిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు 2016లో గంధసిరి గ్రామానికి చెందిన వీఆర్ఏ బుయ్యాఉపేందర్, వీఆర్వో కలిసి మున్నేరు వాగులో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకనే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో తిమ్మినేనిపాలెం గ్రామ సర్పంచ్ అబ్దుల్ నబి తోపాటు మరికొందరు తమది బెదిరించారని, అదేవిధంగా తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించాలని తహసీల్దార్‌కు తెలిపారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించి కోర్టులో చార్జీషీటుదాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయ అధికారినేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

- ఇల్లెందు పట్టణంలో ఘటన



రమేష్ (ఫైల్)

ఇల్లెందు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు విద్యాబోధన చేస్తూ గుండెపోటు రావడంతో తరగతి గదిలోనే కుప్పకూలిపోయి హఠార్మరణం చెందాడు. ఇల్లెందు పట్టణంలోని జేబీఎస్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్‌బోధన చేసే పి. రమేష్ (45) సోమవారం పాఠశాల విధులకు హజరయ్యాడు. తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి ఉపాధ్యాయులు సదరు ఉపాధ్యాయుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే ఉపాధ్యాయుడు రమేష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పాఠశాలలోనే గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందడంతో పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉపాధ్యాయుడు మృతి పట్ల వివిధ ఉపాధ్యాయ సంఘాలు సంతాపం ప్రకటించాయి. ఉపాధ్యాయుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు..



భద్రమ్మ(ఫైల్)

జూలూరుపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన శతావధిక వృద్ధురాలు దుద్దుకూరి భద్రమ్మ(104) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. శతావధిక వృద్ధురాలు మృతదేహాన్ని పలు పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.



దక్షిణ భారతదేశ స్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్



ప్రయోగాల్లో దిట్ట ఈ ఉపాధ్యాయ దంపతులు

- దక్షిణ భారతదేశస్థాయికి ఎంపికైన ఏకైక ప్రభుత్వ పాఠశాల
- బురదరాఘువాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఘనత

ఏన్కూరు, జనవరి20(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశం స్థాయి సైన్స్ పెయిర్ పోటీలకు ఖమ్మం జిల్లా నుంచి ఒకే ఒక్క ప్రభుత్వ పాఠశాల ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో 25 ఎగ్జిబిట్లు ఎంపిక కాగా ఖమ్మం జిల్లా నుంచి ఏన్కూరు మండలం బురద రాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఈఘనత దక్కింది. ఇదే పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న దంపతులు పొట్ట రామారావు, సాగి సుజాతలు విద్యార్థుల్లో సైన్సు పట్ల ఆసక్తులు అయ్యేలా ప్రయోగాలు చేసి విజయవంతం అయ్యారు. వారు పనిచేసిన ప్రతి పాఠశాలలో సైన్సు ప్రయోగాలు అభివృద్ధికి విశేష కృషి చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలిచేలా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన పోటీల్లో దక్షిణభారత స్థాయికి ఎంపికైంది.

గణిత విభాగంలో కె.మహిమ, ఎస్.శ్రావణి ప్రదర్శించిన విజువలైజింగ్ మ్యాథ్స్ అనే ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించింది. వీరు ఈనెల 21 నుంచి 25వరకు పాండిచ్చేరిలో జరిగే సైన్స్‌ఫెయిర్‌లో పోటీల్లో పాల్గొంటారు. ప్రయోగాల ద్వారా విద్యార్థులను తయారుచేస్తున్నారు. సృజనాత్మతకకు పదును పెడుతూ నూతన ఆవిష్కరణలకు ఆలోచింపచేసేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. వీలైనంతవరకు ఎక్కువగా ప్రయోగాల ద్వారా పాఠం అర్థమయ్యేలా భాగస్వాములుగా చేస్తారు.

తక్కువ ఖర్చుతో ఎన్నో పరికరాలు

తక్కువ ఖర్చుతో ఎన్నో పరికరాలు తయారుచేశారు. వీటిలో సూక్ష్మ దర్శిని ఒకటి. కేవలం రూ.50లతో తయారుచేసిన సూక్ష్మదర్శిని ద్వారా ఉల్లిపొర కణాలు, పత్రాల కణాలు, జంతువు కణ నిర్మాణాలు, కాండం అడ్డుకోత, నీటిలో బ్యాక్టీరియా, పెరుగులో ఉండే బ్యాక్టీరియా, బూజు మొదలగు వాటిని చూపిస్తారు. రక్తకణాల పనితీరు, కవాటాల నిర్మాణం, మేక గుండె తీసుకుని దానిలోని గదులను రక్తకణాల పనితీరును కవాటాల నిర్మాణం గురించి తెలియచేస్తారు. మేకకిడ్నీ తీసుకుని దానిలోని వివిధ భాగాలను మూత్రం వడగట్టే విధానాన్ని నెఫ్రాన్ పనితీరును వివరిస్తారు. మేక ఊపిరితిత్తుల్లో సైకిల్ పంపు ద్వారా దానిలోకి గాలిని నింపే ఎలా పనిచేస్తున్నాయో విద్యార్థులకు వివరిస్తారు. విద్యార్థులకు రక్తపరీక్షలలు చేసి గ్రూపులను నిర్ధారిస్తారు. మొక్కల ఆకుల్లో పిండిపదార్థం ఉంటుందని నిర్ధారించే పరీక్ష కిరణజన్య సంయోగ క్రియకు, కార్బన్‌డైయాక్సైడ్ అవసరమనే ప్రయోగం, విత్తనాల్లో శ్వాస క్రియ ప్రోటీన్‌పరీక్ష, ఆమ్లక్షార సూచికల తయారీ, జామ్‌తయారు చేసి చూపించడం వంటి ప్రయోగాలు చేయిస్తూ విద్యార్థులను సైన్సుపట్ల ఆసక్తి కలిగేలా చేస్తున్నారు. ఎక్కడ పోటీలు జరిగినా తప్పనిసరిగా విద్యార్థులను తీసుకెళ్తారు. సొంత ఖర్చులతో ప్రయోగాల ఖర్చులు, ప్రయాణ ఖర్చులతో ప్రదర్శనకు తీసుకెళ్తారు.

రామారావు సాధించిన విజయాలు



జిల్లాస్థాయిలో 70 ఎగ్జిబిట్లుకుగాను 42, రాష్ట్రస్థాయిలో 29 ఎగ్జిబిట్లకుగాను 13, దక్షిణభారతదేశస్థాయిలో 5 ఎగ్జిబిట్లకుగాను 5, జాతీయస్థాయిలో 6కుగాను 1 అవార్డులు పొందారు. 2018 లో అంతర్జాతీయస్థాయిలో జపాన్‌లో ప్రదర్శించిన కుమార ప్రోగ్రాం ఎగ్జిబిట్ అవార్డులు సాధించాయి..

సుజాత సాధించిన విజయాలు



బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న ఈ ఉపాధ్యాయురాలు ఎన్నో అవార్డులు అందుకున్నారు. జిల్లాస్థాయిలో 37 ఎగ్జిబిట్లకు గాను 23, రాష్ట్రస్థాయిలో 16ఎగ్జిబిట్లకు గాను 5, దక్షిణ భారతదేశ స్థాయికి 5, జాతీయస్థాయికి 2సార్లు అవార్డులుపొందారు.

216కిలోల గంజాయి దహనం

తల్లాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన గంజాయిని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆధ్వర్యంలో సోమవారం తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలోని ఏడబ్ల్యూఎం బర్నింగ్ ప్లాంట్‌లో దహనం చేశారు. ఖమ్మం త్రీటౌన్, ఖానాపురం హవేలి, వేంసూరు, పెనుబల్లి, వైరా, ఎర్రుపాలెం, మధిర, బోనకల్, కారేపల్లి, ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 18 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు జరిపిన 216కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న గంజాయిని దహనం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవి, సీసీఆర్‌బీ సీఐ స్వామి, తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు పాల్గొన్నారు.

కార్డెన్‌సెర్చ్‌లో 60వాహనాల పట్టివేత

ఇల్లెందురూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామంలో సోమవారం ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పత్రాలు సరిగ్గాలేని 60 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలను సిజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు సూర్య, సందీప్, మీరీ పఠాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మిరప తోటపై గడ్డి మందు పిచికారి

చింతకాని, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమండవ గ్రామానికి చెందిన మిర్చి రైతు మొగిలి గోపయ్యకు చెందిన 3 ఎకరాల మిర్చి తోటపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారీ చేశారు. ఈ విషయమై బాధిత రైతు వ్యవసాయ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు సోమవారం రైతుకు చెందిన మిర్చి తోటను పరిశీలించారు. తోటపై గడ్డిమందు పిచికారీ చేసినట్లు గుర్తించారు. ఎవరో కావాలనే తన మిరప పంటకు గడ్డి మందు పిచికారీ చేశారని, తోటపై ఇప్పటి వరకు రూ. 2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టానన్నారు. కార్యక్రమంలో ఏవో మానస, ఉద్యాన అధికారి విష్ణు, ఏఈవోలు కళ్యాణి, తేజలు పాల్గొన్నారు.

మధిరలో అగ్నిప్రమాదం

మధిర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని వైరారోడ్డులో ఆదివారం తెల్లవారుజామున పలు దుకాణాలలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షేక్ సుభానికి చెందిన పాత టైర్ల దుకాణంలో అగ్ని అంటుకుంది. అది క్రమంగా పక్కనే ఉన్న మరో దుకాణాలను మంటలు అంటుకున్నాయి. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆపేందుకు ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో పోలీసులు ఎస్ఐ సంధ్య, సీఐ మధు జోక్యంతో వైరానుంచి మరో ఫైరింజన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ప్రమాదం సమీపంలో ఉన్న టీవీఎస్ షోరూం వారిని, మూడునివాస గృహాల వారిని అప్రమత్తం చేయడంతో పెనుప్రమాదం తప్పింది. కాగా ఈ ప్రమాదంలో రూ. 2లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు నిర్ణయించారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం షార్టు సర్క్యూట్ అనే విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఈవిషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ అధికారి బాలకృష్ణ తెలిపారు.

పోటాపోటీగా ఐటీసీ ఎన్నికల ప్రచారం

బూర్గంపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పేపరు కర్మాగారంలో అగ్రగామిగా నిలిచిన ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ నెల 31వ తేదీన బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో జరగనున్న ఈ ఎన్నికలకు ఐదు ప్రధాన యూనియన్లు పోటీ బరిలో నిలిచాయి. కర్మాగారంలో మొత్తం 16 కార్మిక సంఘాల యూనియన్లు ఉండగా, ఎన్నికల బరిలో ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్, బీఆర్టీయూ, టీఈయూ మాత్రమే నిలిచాయి. ఇందుకు గాను ఈ నెల 31వ తేదీన జరగనున్న ఎన్నికల్లో తమ సత్తా చూపేందుకు ఎవరికి వారే వ్యూహ రచనలో నిమగ్నమయ్యారు. ఈ కర్మాగారంలో 14వ వేతన ఒప్పందం జరగాల్సి ఉండగా ఎన్నికలు యూనియన్ నాయకులకు ప్రతిష్టాత్మకంగా మారాయి. కర్మాగారంలో పర్మినెంటు ఉద్యోగులు 1171మంది, 82మంది బదిలీలు మాత్రమే ఓటు హక్కుకు అర్హులు. కేవలం 1253 మంది కార్మికులు ఓటర్లుగా ఉన్న ఈ ఎన్నికలు కర్మాగారంలోని కార్మికులకు కనీస వేతనాన్ని చేయాల్సి ఉంది. బరిలో ఉన్న అభ్యర్థులు కలిసి తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కాగా బూర్గంపాడు మండలంలో ఈ ఎన్నికల హడావుడితో సందడిగా మారింది. కార్మికులను ప్రలోభపెట్టేందుకు మద్యం, నగదు, గిఫ్టులు పంపిణీని సైతం చేస్తూ ప్రచారంలో నిమగ్నం అవుతున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. దీంతో ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికల స్థాయిలో జరుగుతుండటం విశేషం. ఓటర్లను తమ వైపు తిప్పుకునే విధంగా వ్యూహాలు పన్నుతున్నారు.

కొత్త రేషన్‌కార్డులకు మెలికలు

కొత్తగూడెం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తరేషన్ కార్డులు సర్వేలో పంచాయతీకార్యదర్శులు మెలికలు పెడుతండటంతో గందరగోళానికి దారితీస్తుంది. సర్వేలో పంచాయతీ కార్యదర్శులు కొన్నిచోట్ల ఆదాయ సర్టిఫికెట్లు, నోటరీ అడుగుతున్నారు. దీంతో అర్జీదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం తమవద్ద సర్టిఫికెట్లు లేవని అర్జీదారులు చెబితే కచ్చితంగా కావాల్సిందే అని కార్యదర్శులు అంటున్నారు. దీంతో మీసేవా కేంద్రాల వద్దకు క్యూ కడుతున్నారు. కనీసం వారం నుంచి 15రోజులు నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ల జారీకి సమయం ఉండగా..సోమవారం సాయంత్రంతో రేషన్‌కార్డుల సర్వేకు సమయం ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో వార్షిక ఆదాయం నిబంధనలు విధించింది. పట్టణాల్లో రూ. 2 లక్షలు, గ్రామాల్లో రూ.1.50లక్షలు ఉండాలని తెలిపింది.

వార్షిక ఆదాయం తాము ఏ విధంగా నిర్ధారిస్తామని కార్యదర్శులు ఆదాయ ధ్రువీకరణపత్రాలు కావాలని అంటున్నారు. ప్రభుత్వం గత ఏడాది నిర్వహించిన సమగ్ర కుటుంబసర్వేలో కుటుంబవివరాలు సేకరించింది. కుటుంబ వార్షిక ఆదాయం, రేషన్‌కార్డు వివరాలు నమోదు చేశారు. ఆసర్వే ఆధారంగా పరిశీలన జాబితాను ప్రభుత్వం విడుదల చేయగా.. తాజగా ఆదాయ ధ్రువీకరణ పత్రం అడగటంతో గందరగోళానికి గురవుతున్నారు. ఈవిషయమై డీసీఎస్ఓ రుక్మిణీదేవిని వివరణకోరగా రేషన్‌కార్డుల సర్వేల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు చేస్తున్నాం. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్జిదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణలో విద్యుత్ సరఫరాను స్తంభింపజేస్తాం..

- విద్యుత్ ఆర్టిజన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్

పాల్వంచ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని లేని పక్షంలో తెలంగాణ వ్యాప్తంగా మొత్తం విద్యుత్ సరఫరాను స్తంభింపజేస్తామని విద్యుత్ ఆర్టిజన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వజీర్‌లు అన్నారు. సోమవారం ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ కోసం రాష్ట్రస్థాయిలో జనవరి 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తలపెట్టిన 5 రోజుల రిలే నిరాహార దీక్షలను పాల్వంచ కేటీపీఎస్ గేటు ఎదుట వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ విద్యుత్ రంగంలో పని చేస్తున్న 20వేల మంది కార్మికులను కన్వర్షన్ చేయకుండా ఆర్టిజన్ అనే ముద్దు పేరుతో అన్యాయం చేశారని అన్నారు. ఆర్టిజన్ అనే జీవో వలన కార్మికుల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన మోసం నుంచి ప్రస్తుత ప్రభుత్వం గుణపాఠం నేర్చుకుని ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని లేని పక్షంలో తెలంగాణ వ్యాప్తంగా మొత్తం విద్యుత్ సరఫరాను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ప్రసాద్



డివిజన్ బహిరంగ సభల్లో ఎల్‌ఆర్‌ఎస్ స్పాట్ వెరిఫికేషన్

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి 20(ఆంధ్రజ్యోతి):నేటినుంచి డివిజన్ బహిరంగ సభల్లో ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం జరుగుతుందని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం ప్రకటించారు. ఇప్పటికే ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసిన వారు వారి డివిజన్లలో బహిరంగ సభలు జరిగే ప్రాంతంలో పట్టణ ప్రణాళిక సిబ్బందిని కంప్యూటర్‌తో అందుబాటులో ఉంచుతామన్నారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అనుమానాలు వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. బహిరంగ సభలోనే అన్నివిభాగాల అధికారులు అందుబాటులో ఉండటంతో ఎల్ఆర్ఎస్ డబ్బులు కట్టిన స్థలాలను స్పాట్‌లో వెరిఫికేషన్ చేసేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- జాబితాలో పేరు లేదని ఆందోళన చెందవద్దు
- అందరికీ పథకాలు అందేవరకూ ప్రక్రియ కొనసాగుతుంది
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంరూరల్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం, గుర్రాలపాడు గ్రామంలో జరుగుతున్న సర్వేను సోమవారం పరిశీలించారు. తప్పిదాలకు తావు లేకుండా ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇంటికి సందించి దరఖాస్తుదారుల వివరాలు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రత్యేక యాప్ ద్వారా పూర్తిపారదర్శకంగా సర్వే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. విడతలవారీగా అర్హులైన వారందరికీ స్థలంతోపాటు ఇళ్ల మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రైతు భరోసాకింద సాగుకు యోగ్యం కాని భూములను అత్యంత జాగ్రత్తగా గుర్తించాలన్నారు. అర్హుల ఎంపిక చాలా ముఖ్యమన్నారు. గ్రామ పంచాయతీల ద్వారా ఇచ్చిన మైనింగ్ లీజులు, లేఅవుట్ అనుమతులు, ఇటుకబట్టీల, మట్టి తోలకం, నాలా కన్వర్షన్ తదితర అనుమతుల క్రాస్ చెక్ చేయాలాన్నరు. క్షేత్రస్థాయికి వెళ్లి స్పష్టంగా విషయాన్ని స్పష్టంగా నమోదు చేయాలన్నారు. భూముల స్థితిని భట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పథకాలు అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి నాలుగు పథకాలు అందేవరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జాబితాలో తమ పేరు లేదని తమ వద్దకు సర్వేకు రాలేదని ఆందోళన చెందవద్దని సూచించారు. ఇటువంటి వారు గ్రామ, వార్డు సభల్లో ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసినప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని చూసించారు. ఈ దరఖాస్తుల పరిశీలన చేసి అర్హులకు లబ్ధి చేకూర్చుతామన్నారు. ఈనెల 21 నుంచి 24వరకు నిర్వహించే గ్రామసభల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గోనాలని కోరారు. గ్రామ సభల్లో సర్వేప్రకారం లబ్ధిదారుల ప్రాథమిక జాబితా ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, అదనపు డీఆర్డీవో నూరోద్దీన్, ఏడీఏ సరిత, తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.


గుర్రాలపాడులో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

కూసుమంచిలో గ్రామసభలు ఇలా

కూసుమంచి, జనవరి 209ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామసభల షెడ్యూల్‌ను అధికారులు ప్రకటించారు. నేటి ఉదయం భగత్‌వీడు, గట్టుసింగారం, కొత్తూరు, మునిగేపల్లి, నర్సింహులగూడెం పెరికశింగారం, చౌటపల్లి మల్లాయిగూడెం, నేలపట్ల, తురకగూడెం గ్రామాల్లో నిర్వహించనున్నారు. 22న గోరీలపాడు తండ, జీళ్లచెరువు, కూసుమంచి, మల్లేపల్లి, ముత్యాలగూడెం, నాయకన్‌గూడెం, పాలేరు, పోచారం, చేగొమ్మ, గైగొళ్లపల్లి, లోక్యాతండ, రాజుపేట, 23న అగ్రహారం, చంద్యతండ, ఈవ్వరమాధారం, గంగబండతండ, జక్కేపల్లి, కేవ్వాపురం, కిష్టాపురం, అజ్మీరా హీరామాన్‌తండ, బోడియతండ, ధర్మతండ, జుజ్జులరావుపేట, కోక్యాతండ, రాజుపేట బజార్, గుర్వాయిగూడెం, జక్కేపల్లి ఎస్సీకాలనీ, లాల్‌సింగ్తండ, లింగారాంతండ, మంగలితండ, ఎర్రగడ్డతండ గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి తెలిపారు.

గ్రామసభలు ప్రశాంతంగా నిర్వహించాలి: జేడీఏ

తిరుమలాయపాలెం, జనవరి20(ఆంధ్రజ్యోతి):మండలంలో మంగళవారం నుంచి ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభలు ప్రశాంతంగా జరిగేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండలస్పెషలాఫీసర్, జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

వినియోగదారులకు అవగాహన సదస్సు

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నయబజార్ జూనియర్ కళాశాలలో సోమవారం షేర్ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో ట్రాయ్ కాగ్ సభ్యుడు రావూరి ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

21వ డివిజన్ జవాన్ సస్పెండ్

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిపాలన సమయం మేరకు పారిశుధ్య ఉద్యోగులు విధుల్లో ఉండాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు. సోమవారం ఉదయం కమిషనర్ 21,37డివిజన్లలో తనిఖీలు చేశారు. 21వ డివిజన్‌లో రహదారులపై అపరిశుభ్రత ఉండటం, డ్రెయినేజీల్లో వ్యార్థాలతో నిండిపోవటంపై కమిషనర్ తీవ్రంగా స్పందించారు. స్థానిక జవాన్ బీ.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని పారిశుధ్య పర్యవేక్షకుడు ఎం.సాంబయ్యను ఆదేశించారు. రహదారులు, డ్రెయినేజీల్లో చెత్త కనిపిస్తే జవాన్లు, శానటరీ ఇన్స్‌పెక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కేఎంసీ కార్యాలయంలో శానిటరి ఇన్స్‌పెక్టర్లు, పర్యవేక్షకులతో కమిషనర్ అభిషేక్ సమావేశం నిర్వహించారు. ఉదయం5.30గంటల నుంచి 11గంటల వరకు గార్బేజ్ పాయింట్స్‌ను నిత్యం శుభ్రం చేయాలని ఆదేశించారు.

కేఎంసీ విధుల్లో నయా జోష్

- నూతన వార్డు ఆఫీసర్లుకు కీలక విభాగాలు
- ముగ్గురుకి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి
- పాతుకుపోయిన ఉద్యోగుల్లో అలజడి

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడువర్గాలు, ఆరు గొడవలతో ఉండే ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం పరిపాలనలో కొత్త మలుపు తిరిగింది. వివాదస్పోదాలకు కారణమైన ఉద్యోగులను ఇతర మున్సిపాలిటీలకు బదిలీ చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య కేఎంసీ పరిపాలనలో కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి పలు కీలకమైన విభాగాల్లో నియమకాలు చేశారు. దీంతో కేఎంసీ విధుల్లో నయా జోష్ కనిపించబోతుంది. కాగా ఇప్పటికే పలు కీలకమైన విభాగాల్లో పాతుకుపోయిన ఉద్యోగుల్లో మాత్రం అలజడి నెలకొంది. తమను ఏ పారిశుధ్య విధులకు కేటాయిస్తారో అని చర్చించుకుంటున్నారు.

కీలకమైన విభాగాలకు రెగ్యూలర్ ఉద్యోగులు

ఖమ్మం నగర పాలక సంస్థలో రెగ్యూలర్ ఉద్యోగుల కొరత ఉండటంతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పరిపాలన కొనసాగించారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం గ్రూప్4 ఉద్యోగ నియామకాలు చేపట్టింది. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థకు 35 మంది వరకు వార్డు ఆఫీసర్లు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇందిరమ్మసర్వే, రేషన్‌కార్డుల సర్వే అనంతరం వీరిలో సాంకేతిక సామార్థ్యం, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని ముఖ్యమైన విభాగాలకు నియామకం చేశారు.



నియామకాలు ఇలా

డీఆర్ఎఫ్ విభాగానికి పీ పులబాలసతీష్‌ను కేటాయించారు. ఇస్టాబ్లిస్‌మెంట్‌కు యడవల్లి వినోద్‌కుమార్, అరుంధతి, శశికలను నియామకం చేశారు. పారిశుధ్య వాహనాల ట్రాకింగ్‌కు హేమంత్‌సాయిని, గ్రంథాలయాల నిర్వాహణకు బెండు వీరబాబును నియమించారు. ఇక ఎంతో కీలకమైన ఎకౌంట్స్ విభాగానికి పరికోళ్ల ఉపేందర్‌రావు, మాధినేని మురళీ, నిరోషాలను కేటాయించారు. కేఎంసీ పీఆర్వోలుగా ప్రత్యూషా, కారుమంచి యాదగిరిలకు ఆదేశాలిచ్చారు. సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రణాళిక విభాగానికి అనూహ్యంగా ఐదుగురు వార్డు ఆఫీసర్లను కేటాయించారు. వీ.ఉదయ్‌బాస్కర్, గంగుల వెంకటేశ్వర్లు, గుగులోత్ రవీందర్, వెముల మురళీ, ప్రేమ్‌కుమార్‌లను పట్టణ ప్రణాళిక లోని ముగ్గురు టీపీఎస్‌లకు కేటాయించారు. శానిటేషన్ స్టోర్ రూమ్‌కు సందీప్ వార్డు ఆఫీసర్‌ను నియామకం చేశారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా ముగ్గురుకి పదోన్నతి

ఖమ్మం నగర పాలక సంస్థలో పలు విభాగాల్లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. ఎకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న జీ.కవిత, కౌన్సిల్ సమావేశాలు విభాగం రాంబాయితో పాటుగా సత్తుపల్లి నుంచి వచ్చిన వార్డు ఆఫీసర్ శ్రీనుకు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. బిల్‌కలెక్టర్(జూనియర్)గా ఉన్న శ్రీనుకు ఐర్‌ఐగా నియమించటంతో పలువురు ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కూల్చివేతలను అడ్డుకుంటాం

సుందరయ్య నగర్‌లో పర్యటించిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

ఖమ్మంటౌన్,జనవరి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాదిలో చేసిందేమి లేదని నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం త్రీ టౌన్ లోని సుందరయ్యనగర్‌లో రహదారి విస్తరణకు మార్కింగ్ చేసిన నివాసాల వారితో సమావేశమైనారు. 30వడివిజన్‌లో రహదారి విస్తరణకు 80అడుగులు మార్కింగ్ చేసి నివాసాలను పూర్తిగా తొలగిస్తే నివాసల్లో ఉండే వారు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆరోపించారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మక్కల కమల, పగడాల శ్రీవిద్య, కూరాకుల వలరాజు, తోట ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం, జనవరి20(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకంకు ఐదేళ్లను పరిగణలోకి తీసుకోవాలని గ్రామసభల ద్వారా నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణకు సోమవారం వినతిపత్రం అందించారు. సీపీఎంపార్టీ , బీఎస్పీ, బీఆర్ఎస్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో వారు వినతి అందించారు.

టీఎన్జీవో కార్యవర్గాన్ని అభినందించిన కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్,జనవరి20(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా నూతన కమిటీని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యవర సభ్యులు సోమవారం కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ వారికి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత దగ్గరగా చేర్చేందుకు ఉద్యోగులు కృషిచేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో సహకరించాలని వారు కలెక్టర్‌ను, అదనపు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ వల్లపు వెంకన్న, వైస్‌ప్రెసిడెంట్ యర్రా రమేష్, కరణ్‌సింగ్, లలితకుమారి, తాళ్లూరి శ్రీకాంత్, బూస చంద్ర శేఖర్, ఏలూరి హరికృష్ణ కోనార్, శీలం రాధికరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధా కృష్ణ, పబ్లిసిటీ సెక్రటరీ యర్రమల శ్రీనివాస్, ఖమ్మం నగర శాఖ నాయకులు శంకర్, నెల్లూరి రవి, పవన్, ఖమ్మం రూరల్ యూనిట్ అధ్యక్షులు లింగమూర్తి, మధిర యూనిట్ అధ్యక్షుడు గుర్రం శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.


టీఎన్జీవో నాయకులను అభినందిస్తున్న కలెక్టర్

రాజీవ్ స్వగృహ ఇళ్లను పేదలకు ఇవ్వాలి: సీపీఐ

ఖమ్మంరూరల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలేపల్లిలోని రాజీవ్ స్వగృహ ఇళ్లను అర్హులైన పేదలకు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ బృందం రాజీవ్ స్వగృహ ఇళ్లను పరిశీలించారు. రాజీవ్ స్వగృహను కావాలనే నిర్లక్ష్యం చేస్తు ప్రభుత్వ ఆస్తులను ధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇంళ్లను పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబాశివారెడ్డి, నూనెశేశిధర్, జాలా నర్సింహరావు, రెహమాన్, శేఖర్‌నాయక్, అదిల్ పాల్గొన్నారు.

మ్యాథ్స్ టెస్టులో హార్వెస్ట్ విద్యార్థినికి ర్యాంక్

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి20(ఆంధ్రజ్యోతి): అసోషియేషన్ మ్యాథ్‌మాటిక్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మ్యాథ్స్ టాలెంట్ కాంపిటీషన్‌లో నగరంలోని హార్వెస్ట్ పాఠశాల 10వతరగతి విద్యార్థిని ఎం. ధన్విత అత్యుత్తమ ప్రతిభకనబరచింది. ఆల్ ఇండియా 8వర్యాంక్ సాధించిందని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ర్యాంక్ సాధించిన విద్యార్థినిని అభినందించారు.



న్యూఇరా విద్యార్థినికి స్వర్ణనంది అవార్డు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ ఆర్ట్ థియేటర్స్ వారు హైదరాబాద్‌లో నిర్వహించిన మధుర సంక్రాంతి కార్యక్రమంలో నగరంలోని న్యూఇరా పాఠశాల విద్యార్థిని బీవీఎస్ వైష్ణవికి స్వర్ణనంది అవార్డు దక్కించుకుందని పాఠశాల చైర్మెన్ ఐవి రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. మొత్తం 300 మంది నృత్య కళాకారులు పాల్గొన్నారు. అందులో ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించినందుకు అవార్డు అందుకుందని తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు.



కేఎంసీ ఫ్లోర్ లీడర్‌గా కర్నాటి కృష్ణ

- డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా మక్బూల్
- కమిషనర్‌కు లేఖను అందించిన పగడాల, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గంలో ప్రతిపక్ష ఫ్లోర్‌లీడర్‌గా గుర్తించాలని బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్పొరేటర్లు కమిషనర్ అభిషేక్ అగస్త్యకు పార్టీ లేఖను అందించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు సమావేశమైనారు.ఫ్లోర్‌లీడర్‌గా కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా మక్బూల్‌ను అధికారిక ప్రొటోకాల్ మేరకు గుర్తించాలని కమిషనర్‌కు లేఖను అందించారు. పాలకవర్గ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని కోరారు. కార్పొరేటర్లు తొట రామారావు, బుడిగం శ్రీనివాస్,నాగండ్ల కోటి,దాదే అమృత, పల్లా రోసిలీనా, సరస్వతి, పగడాల శ్రీవిద్య, తోట ఉమారాణి, దండ జ్యోతిరెడ్డి, చిరుమామిళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కమిషనర్‌కు లేఖను అందిస్తున్న పగడాల నాగరాజు, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్లకు ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని ఏడు తెలంగాణా మైనారిటీస్ గురుకుల పాఠశాలలు,కళాశాలల్లో(ఇంగ్లీష్‌మీడియంలో) చేరేందుకు 2025-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కు సత్యనారాయణ తెలిపారు. ఈనెల18 నుంచి అడ్మిషన్లు ప్రారంభమై ఈనెల 28న ముగుస్తాయని తెలిపారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు పాఠశాలల్లో, ఇంటర్మీడియట్ చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సంబంధిత పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో వికలాంగుడికి ట్రైసైకిల్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ ఆధ్వర్యంలో ఓ వికలాంగునికి ట్రైసైకిల్‌ను అందించారు. అమెరికా తెలుగు అసోసియేషన్‌కు చెందిన ద్వారకానాథ్‌రెడ్డి సహాయంతో బుట్టాయిగూ చెందిన అఖిల్‌కు ట్రైసైకిల్‌ను ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ జగదీష్ బాబు అందచేశారు.

కేంద్ర ప్రభుత్వ హామీలను అమలు చేయాలి

ఖమ్మంటౌన్,జనవరి 20(ఆంధ్రజ్యోతి):కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కిసాన్ మోర్చాకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వామపక్ష రైతు సంఘాల నాయకులు మాదినేని రమేశ్, కొండపర్తి గోవిందరావు, ఆవుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ, రైతు అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల నిరసన

తిరుమలాయపాలెం, జనవరి20(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడిని నిరసిస్తూ విద్యాపరిరక్షణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం తిరుమలాయపాలెంలో టీపీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి మాట్లాడారు. దాడి జరగడం అమానుష చర్యగా ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వినతులు సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణిలో వినతులు స్వీకరించిన కమిషనర్ అభిషేక్

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి20(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజావాణీలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రభుత్వ స్థలాలు అక్రమణ, తాగునీటి కుళాయిలు బిల్లులు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు కోసం అత్యధికంగా ఫిర్యాదులు అందాయి. ఈఈ కృష్ణలాల్, ఆర్వో శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక అధికారి వసుందర, టీఎంసీ సుజాత, ఏవో శివలింగం, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్యకు సంబంధిత దరఖాస్తులను కమిషనర్ అందించారు.

యంగ్ ఇండియాకే బోల్‌లో యువత పాల్గొనాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి20(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన యంగ్ ఇండియాకేబోల్ కార్యక్రమంలో యువత అధికంగా పాల్గొనాలని జిల్లాయువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ కోరారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాయకులు బెజ్జం గంగాధర్, నెల్లూరి ఉపేందర్, చిలుకపల్లి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' సేవలు అభినందనీయం

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి20(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ హ్యాండ్స్ అందిస్తున్న సేవలు అభినందనీయమని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. సోమవారం కొణిజర్ల మండలం పెద్దమునుగాల గ్రామానికి చెందిన తడికమళ్ళ నాగేశ్వరరావు,స్వాతీ దంపతుల కుమారులు మనీస్, మనోజ్ పుట్టకతోనే శారీరక వైకల్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న అమెరికాలో ఉంటున్న మద్దినేని రవి మిత్ర బృందం రూ.2లక్షలను హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తరుపున అదనపు కలెక్టర్ శ్రీజ కుటుంబ సభ్యులకు అందించారు.ఈ కార్యక్రమంలో మద్దినేని ప్రసాద్‌రావు, కమల, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్దివెంకటేశ్వర్లు, ఓపెన్‌స్కూల్ కోఆర్డీనేటర్ పాపారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, మోసాల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్ సాయి అన్నారు. సోమవారం నగరంలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల నిరసన

కూసుమంచి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే కోడిగుడ్డు ధర మార్కెట్లో రూ.8ఉండగా తమకు ప్రభుత్వం రూ.5మాత్రమే చెల్లిస్తోందని భోజన వర్కర్లు ధర్నా నిర్వహించారు. సోమవారం ఎంఈవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు గుండెపొంగు మల్లేష్ పాల్గొన్నారు. ఎంఈవో వీరాస్వామికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మధ్యాహ్న వర్కర్లు కోటమ్మ, కృష్ణకుమారి, నందిని, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఆత్మీయ భరోసా వర్తింపచేయాలి

కూసుమంచి, జనవరి20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీభరోసా వర్తింప చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి తోటకూరి రాజు డిమాండ్ చేశారు. సోమవారం కూసుమంచి తహసీల్దార్ కరుణశ్రీకి వినతిపత్రం అందించారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిట్టూరి వెంకన్న, శీలం గురుమూర్తి, గంగాధర్, షన్మతిరావు, గన్య, బాబు, సైదులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎఫ్ వాహనం మూలకు

- చిన్నపాటి మరమ్మతులు చేయించని అధికారులు



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి20(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాలు, వీఐపీల కార్యక్రమాల నుంచి ట్రాఫిక్ నియంత్రణ, నర్సరీల నుంచి మొక్కలు తరలింపు వరకు ఎంతో కీలకంగా పనిచేసే ఖమ్మం నగర పాలక సంస్థలోని డీఆర్ఎఫ్ వాహనాలు మూలనపడ్డాయి. చిన్నపాటి మరమ్మతుల కారణంగా నెలల తరబడి ఉంటున్నాయి. కేఎంసీలో అత్యవసర సేవల కోసం మూడేళ్ల క్రితం రెండు డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. రెండు నూతన వాహనాలను కొనుగోలు చేశారు. అందులోని ఒక వాహనం గతేడాది నవంబరు నుంచి బయటకు తీయటం లేదు. వాహనం నడిచేందుకు క్లచ్‌ప్లేటులో పోయాయని, టైర్లుఅరిగి పోయాయని కేఎంసీ కార్యాలయంలో మూలకు పడేశారు. కేవలం రూ.20వేలు కేటాయిస్తే సేవలు అందించే అవకాశం ఉందని వాహన మెకానిక్‌లు అంచనాలు సైతం ఇచ్చారు. ఇప్పటికైనా రెండు వాహనాలు రోడ్డెక్కేలా చూడాలని కార్పొరేటర్లు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకే అందాలి



కూసుమంచి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకే అందేలా గ్రామసభల్లో ఎంపిక చేయాలని కూసుమంచి మండల ప్రత్యేకాధికారి శ్రీలత తెలిపారు. సోమవారం కూసుమంచి మండల పరిషత్ ఆవరణలో మంగళవారం నుంచి జరుగనున్న గ్రామసభల నిర్వహణపై గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, గ్రామకార్యదర్శులు, ఏఈవోలు, టెక్నికల్ అస్టెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఎంపీవో రామచంద్రరావు, ఏవో వాణి, ఏపీవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

నేలకొండపల్లి,జనవరి20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగ్రాజుపల్లి గ్రామ పంచాయతీకి కోటా అనసూర్యమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు వీరబాబు, రామారావు, దుర్గారావు దాదాపు రూ.30వేల విలువైన 50కుర్చీలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీ శివ, సీడీసీ మాజీ ఛైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, కార్యదర్శి రామారావు, తుమ్మా ఉపేందర్, తాటికొండ కన్నయ్య, దండా రాధాకృష్ణ, నెల్లూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలి

» కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్

తల్లాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్ర గౌడ్ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావే శంలో తహసీల్దార్ వనజ, ఏవో ఎండీ.తాజుద్దీన్, ఎంపీవో కొండ పల్లి శ్రీదేవి, ఆర్ఐలు భాస్కర్, ఖాజామోహిద్దీన్ పాల్గొన్నారు.

కల్లూరులో..

కల్లూరు/పెనుబల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామసభల విధి విధానాలను పకడ్బందీగా అమలు చేయాలని కల్లూరు ఆరీవో ఎల్. రాజేంద్రగౌడ్ అన్నారు. సోమవారం కల్లూరు, పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయంల్లో నాలుగు పథకాల అమలుపై జరగనున్న గ్రామ సభల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు సాంబశివుడు, గంటా ప్రతాప్, ఎంపీడీవోలు చంద్రశేఖర్, అన్నపూర్ణ, డిప్యూటీ తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఏవో రూప, ఎంపీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

వైరాలో..

వైరా, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ ఆదేశించారు. వైరాలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన అధికారులు, సిబ్బంది సమన్వయసమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతీ, ఏవో మయాన్ మంజూఖాన్, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎంపీవో జ్యోత్స్నదేవి, ఏపీవో అనురాధ పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్, 20(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల సర్వే జాబితాతో సక్రమంగా గ్రామసభలను నిర్వహించాలని డీపీవో ఆశాలత ఆదేశించారు. మండలంలోని ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం గ్రామాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కడారు విజయ భాస్కరరెడ్డి, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో వి.వి.ఎస్ శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

సత్తుపల్లిరూరల్‌లో..

సత్తుపల్లిరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నేటినుంచి మూడు రోజుల పాటు సత్తుపల్లి మునిసిపాలిటీలో గ్రామసభలు నిర్వహించనున్నారు.

చింతకానిలో...

చింతకాని, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామసభలపై ఆయా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, డీఎస్‌వో చందన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంపీడీవో రామ య్య, ఏవో మానస, డీటీ వీరభద్రునాయక్, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముదిగొండలో..

ముదిగొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి ఆదేశించారు. సోమవారం ముదిగొండ రైతువేదికలో అధికారులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఏవో వేణు, ఎంపీవో కిషోర్, ఏపీఎం కల్పన తదితరులు పాల్గొన్నారు.



చింతకానిలో మాట్లాడుతున్న అధికారులు



బోనకల్‌లో..

మునిసిపాలిటీ సమగ్రాభివృద్ధికి తోడ్పాటునందిస్తా



కౌన్సిలర్లతో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ సమగ్రాభివృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హామీ ఇచ్చారు. మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన సోమవారం మునిసిపాలిటీ 25వ చివరి సాధారణ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. తన హయాంలో మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. ఆతర్వాత ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను పాలకవర్గం సన్మానించింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, వైస్‌ఛైర్మన్ ముళ్లపాటి సీతరాములు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత అటవీశాఖ అధికారి నరసింహారావు మృతి



నరసింహారావు

కల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో రామకృష్ణ సేవాసమితి వ్యవస్థాపకులు, విశ్రాంతి అటవీ శాఖ అధికారి ఉప్పు నరసింహారావు(80) సోమవారం తన నివాస గృహంలో మృతి చెందారు. కల్లూరు పట్టణంలో రామకృష్ణసేవా సమితి సంస్థను ఏర్పాటు చేయటంలో నరిసింహారావు కీలక పాత్ర వహించారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు నరసింహారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వెదుళ్ల చెరువు సర్వే

తల్లాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని వెదుళ్ల చెరువును సోమవారం నీటిపారుదల, సర్వే, రెవెన్యూశాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ధర్మారావు ఆధ్వర్యంలో తల్లాడ మండల సర్వేయర్ భరత్, నీటిపారుదలశాఖ ఏఈ శ్రీనివాసరెడ్డి సర్వేను నిర్వహించారు.



సర్వే చేస్తున్న అధికారులు

స్నేహితుడి పాడెమోసిన మాజీమంత్రి సంభాని



సంభానీతో విష్ణు (ఫైల్)

సత్తుపల్లిరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యో తి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన విష్ణు ఓఎస్‌డీగా పని చేస్తూ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆదివారం గుం డెపోటుతో బత్తినీడు ఆది విష్ణుమూర్తి మృతి చెందడంతో సోమవారం నిర్వహించిన అంత్యక్రియల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్ పాల్గొని పాడెమోశారు. ఈ సందర్భంగా విష్ణుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

వైరా, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన నారగాని సతీష్ కుటుంబానికి ట్రాన్స్‌కో నుంచి మంజూరైన రూ.ఐదులక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును సోమవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అందజేశారు. మునిసిపల్ కార్యాలయంలో మృతుడు భార్యకు ఈ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, కట్ల రంగారావు, పొదిల హరినాథ్, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, మేడూరి రామారావు, షేక్.సైదా పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ మాట్లాడుతూ సీఎస్సీలో తిప్పారతి రేతికా సింధు, మోదుగు రవికుమార్, కూరపాటి రాకేష్, ఈసీఈ నుంచి శీలం హరిణి, ఉబ్బనపల్లి ధనుష్‌గోపి, ఖమ్మా వరలక్ష్మి, మారుపాకల అఖిల, తన్నీరు స్ఫూర్తిలు ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, డిప్లమో డీన్ డాక్టర్ ఎంవీ. రామచంద్రరావులు అభినందించారు.

చిలుకూరులో పొలంబాట

మధిర రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపాడు, చిలుకూరు గ్రామాల్లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఏఈ మైథిలి మాట్లాడుతూ రైతులు పొలాల్లో విద్యుత్‌ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది వెంకటేశ్వరరావు, నాగరాజు, ప్రకాశరావు పాల్గొన్నారు.

దుకాణాల వేలం వాయిదా

మధిర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా శ్రీమృత్యుంజయస్వామి దేవాలయంలో ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో దుకాణాలు ఏర్పాటుచేసుకునేందుకు దేవాదాయ శాఖ అధికారులు సోమవారం వేలం పాటలు నిర్వహించారు. సరైన డిపాజిట్లు రాని కారణంగా జయింట్ వీల్స్ ప్రసాదాల విక్రయాలు, కొబ్బరి చిప్పల వేలం పాటలను వాయిదా వేశారు. కొబ్బరి కాయలు అమ్ముకొనేందుకు నిర్వహించిన వేలంలో 71వేల రూపాయలకు సిరిపురానికి చెందిన వ్యాపారి పాటను దక్కించుకున్నాడు. వాయిదా వేసిన పాటలను తిరిగి పై అధికారుల ఆదేశాలపై తేదీ నిర్ణయించి నిర్వహిస్తామని ఆలయ అధికారి కొత్త జగన్‌మోహన్‌రావు, ఖమ్మం నుంచి వచ్చిన ఇన్‌చార్జి అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి రాధ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

» జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ

ముదిగొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. సోమవారం ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో నమోదైన ఫైలేరియా కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలోని ల్యాబ్, ఫార్మాసిస్టు, వ్యాక్సిన్ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్‌యాదవ్, వైద్యాధికారిణి అమూల్య, వైద్యసిబ్బంది రామారావు, లత, కుమారి, సత్యావతి పాల్గొన్నారు.



వ్యాక్సిన్ నిల్వలను పరిశీలిస్తున్న వెంకటరమణ

గిరిజన హాస్టల్ ఏర్పాటుకు సన్నాహాలు

» సహాయ గిరిజన అభివృద్ధి అధికారి జహీరుద్దీన్



మాట్లాడుతున్న ఏటీడీవో జహీరుద్దీన్

ఏన్కూరు, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఏన్కూరులో గిరిజన హాస్టల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సహాయ గిరిజన అభివృద్ధి అధికారి జహీరుద్దీన్ తెలిపారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారు. ఎంతమంది కి హాస్టల్ ఆవశ్యకత ఉన్నది వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఏర్పాటుకు మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలపై ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఐటీడీఏ పీవో కు ప్రత్యక్షంగా వివరించారు. ఐటీడీఏ పీవో ఆదేశాలమేరకు ఏటీడీవో జహీరుద్దీన్ వసతిగృహ ఏర్పాట్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం, అధ్యాపకులు కవిత, సుందర్, కృష్ణప్రసాద్, బాబులాల్, రామారావు, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల,జనవరి20(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల ఆదర్శ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌కు తాత్కాలిక పద్ధతిలో ముఖ్య కార్య నిర్వాహణ అధికారి(సీఈవో)గా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కంపెనీ ఛైర్మన్ ఫణికుమారి, మండల ఐకేపీ ఏపీఎం నాగపుల్లారావు సోమవారం తెలిపారు. అభ్యర్థులు బీఎస్సీ అగ్రికల్చర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, డిప్లమా చేసిన వారు అర్హులని తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని, 35 ఏళ్లలోపు వయస్సు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 28వ తేదీ లోగా కొణిజర్ల ఐకేపీ కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన

బోనకల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో సోమవారం రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఏఎంవీఐ ఎం. రవిచందర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతతో రోడ్డు నియమాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్ కుమార్, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

'ధరలు అందుబాటులో ఉండేలా చూడాలి'

మధిర, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మధిర జాతరలో ఏర్పాటు చేసే జయింట్ వీల్స్ సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సోమవారం మధిరలో జరిగిన వేలం పాటల కార్యక్రమాన్ని సీపీఎం నాయకులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం ఉత్సవాలు నిర్వహించాలని, సామాన్యులకు అందనంత ధరలు నిర్ణయించి జాతరను సామాన్యులకు దూరం చేయవద్దని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు, రాధాకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ సేవల కోసం నగదు వితరణ

బోనకల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ విభాగం నందు నిధుల సమస్యతో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలగడంతో సమస్యను భాగం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగం రాకేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సోమవారం రూ. 11 వేల నగదును వితరణగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది కాలం పాటు ఇంటర్నెట్ సేవలు అందించేందుకు అయ్యే ఖర్చును ప్రజల కోసం తమ ఫౌండేషన్ ద్వారా భరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంఈవో దామాల పుల్లయ్య, ఎంపీవో శాస్త్రీ, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి, పత్తికి మద్దతు ధర కల్పించాలి: సీపీఎం

మధిర రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పత్తి, మిర్చికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ సోమవారం మధిరలోని రెవెన్యూ కార్యాలయం వద్ద సీపీఎం, తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మందా సైదులు, శీలం నర్సింహారావు మాట్లాడుతూ రైతాంగం పండించిన పత్తి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధర లేక, రైతులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చికి రూ.25వేలు, పత్తికి రూ.పదివేలు మద్దతు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తేలప్రోలు రాధాకృష్ణ, వూట్ల శంకర్‌రావు, మహేందర్, పడకంటి మురళీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కల్లూరులో సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను, బిల్లులను ఇతరత్ర డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 27 వ తేదీన ఒక రోజు బంద్ పాటిస్తున్నట్లు కోరుతూ ఎంఈవో నివేదితకు కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, దామాల దయాకర్, కార్మికులు రమాదేవి, అప్పమ్మ, సుశీల, అలివేలు, మారేమ్మ పాల్గొన్నారు.

'తపాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి'

చింతకాని, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ వీరభద్రస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో తపాలశాఖ ద్వారా నిర్వహిస్తున్న సేవలపై సోమవారం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ గోపినాథ్, తపాలాశాఖ తెలంగాణ సర్కిల్ అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి రాంప్రసాద్, సబ్ పోస్టమాస్టర్ తోటకూరి పుల్లారావు పాల్గొన్నారు.

హెచ్ఐవీని అవగాహనతోనే నిరోధించవచ్చు

» సత్తుపల్లి ఐసీటీసీ కౌన్సిలర్ కుబేరుడు

సత్తుపల్లిరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులపై ప్రతిఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నప్పుడే నిరోధించేందుకు అవకాశం ఉంటుదని సత్తుపల్లి ఐసీటీసీ కౌన్సిలర్ జీ.కుబేరుడు పేర్కొన్నారు. సోమవారం సత్తుపల్లిలో ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ సెంటర్, సింగరేణి, కిష్టారంలోని లారీ యూనియన్ ఆఫీస్, తదితర ప్రాంతాలలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంపై ఎల్‌ఈడీ తెర ద్వారా అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి, హెచ్ఐవీ, క్షయవ్యాధి సంబంధం, సుఖ వ్యాధులు, చికిత్స గురించి, హెచ్ఐవీ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, టోల్ ఫ్రీ నెంబర్ 1097గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ డీ.సురేష్, జాగృతి స్వచ్ఛంద సేవాసంస్థ బాధ్యులు వీణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల నిరసన

మధిర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ పాఠశాల హెచ్ఎం రాములుపై అరాచక శక్తులు దాడి చేయడాన్ని ఖండిస్తూ ఎస్టీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటా రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల, జనవరి20(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పరిధిలోని పెద్దగోపతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సోమవారం భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

బోనకల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు గుగులోతు రామకృష్ణ, సదాబాబు, రంగారావు, కొమ్ము శ్రీనివాసరావు, కాంతారావు, రత్నాకర్, మాదినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మధిరలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఏన్కూరు, జనవరి20(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ హైస్కూల్ హెచ్ఎం కంబాలపల్లి రాములుపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం భోజన విరామ సమయంలో మూలపోచారం, బురదరాఘవాపురరం, ఏన్కూరు, తిమ్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోతు రాంచంద్, మూడు పుల్లయ్య, ఉపాధ్యక్షులు శ్రీదేవి, జె.పుల్లయ్య, హెచ్ఎంలు జి.నాగరాజు, బి.శోభన్, శంకరరావు, రాఘవరావు, డి.నరసింహారావు, హీరాలాల్, రమేష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి: సీపీఎం

వైరా, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మునిసిపల్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా, డివిజన్ కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, భూక్యా వీరభద్రం పాల్గొని ప్రసంగించారు. అదే సమయంలో మునిసిపల్ సాధారణ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మేరుగు సత్యనారాయణ, మచ్చా మణి పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

సత్తుపల్లిరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం హైదరాబాద్‌లోని మందిరంలో బహుమతులను అందజేశారు. ఆసంస్థ జాతీయ సేవా కో-ఆర్డినేటర్ కోటీశ్వరి చేతులమీదుగా అందుకున్న వారిలో రోహిణివర్షిత(శ్రీవాణి కళాశాల), మౌనిక (శ్రీ నారాయణ కళాశాల), జీ.ఉషారాణి (సదాశివునిపాలెం), రిషేశ్వరి (సెయింట్ జోసెఫ్ హైస్కూల్)లు ఉన్నట్లు జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త అద్దంకి తనూజ తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలతో ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాం

» తహసీల్దార్ ఏ.వనజ

తల్లాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలం పినపాక గ్రామంలో మీసేవ నిర్వాహకుడు నాగబాబు, వీఆర్ఏ రమేష్‌లను జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు పంపించడం జరిగిందని తల్లాడ తహసీల్దార్ ఏ.వనజ తెలిపారు. పినపాక గ్రామంలో 35మంది రైతులుండగా 15ఎకరాల 8కుంటల భూమిని ఆన్‌లైన్ చేసేందుకు వారు వెళ్లారన్నారు. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో ఒక దరఖాస్తు ఆన్‌లైన్ చేయగా ఆదివారం పినపాక గ్రామంలో మీసేవ నిర్వాహకుడు నాగబాబు మూడు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. సర్వర్‌ప్రాబ్లం ఉండటం వల్ల ఆన్‌లైన్ చేసేందుకు మీసేవ నిర్వాహకులను గ్రామాలకు పంపించడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ చేసేందుకు రైతు రూ.1170మాత్రమే చెల్లించవల్సి ఉంటుందన్నారు.

సీఎం బృందాలకు స్వాగతం పలికిన రావినూతల వాసి మంజుల



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంజుల

బోనకల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు షైనేని రవి కుమార్ కుమార్తె మంజుల తెలుగు రాష్ట్రాల సీఎం బృందాలకు స్వాగతం పలికారు. మంజుల ఇటలీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. కంపెనీ తరపున ఆమె స్విట్జర్లాండ్‌కు వచ్చింది. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ వార్షిక సదస్సులో పాల్గొనడానికి వచ్చిన తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, కింజవరపు రామ్మోహన్ నాయుడులను కలుసుకొని స్వాగతం పలికారు.

వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన వెయ్యి గొంతుల, లక్ష డప్పుల కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం నాయకులు కోరారు. సోమవారం కల్లూరులో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంగేపు రామకృష్ణ, బి వెంకటేశ్వర్లు, ఎన్ కోటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, కొండూరి కిరణ్‌కుమార్, గుర్రాల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన రైతులు

చింతకాని, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొదుమూరు- వందనం ఎత్తిపోతల పథకం నీటిని పంట పొలాలకు మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత రైతులు జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను సోమవారం కలసి వినతిపత్రం సమర్పించారు. నీటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా ఉండేలా సంబంధిత అధికారులకు సూచించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొల్లి సీతయ్య, పెంట్యాల అప్పారావు, వేముల యాదగిరి, భయ్యా శ్రీను, చిట్టిమోదు లింగయ్య, మాదిన్ని రవి, సారిక వెంకటేశ్వర్లు, రైతులు కలిశారు.

25న ఖమ్మంలో యాదవ సంఘ సమావేశం

సత్తుపల్లిరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరిగే యాదవ సంఘ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆసంఘ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం సత్తుపల్లిలోని మునిసిపల్ కౌన్సిలర్ దూదిపాల రాంబాబు నివాసంలో యాదవ సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మూడు ముంతల కోడిలింగయ్య, గంగరాజు, మల్సూర్‌యాదవ్, దూదిపాల నరసింహారావు, జంగా సత్యనారాయణ, జోనెబోయిన శ్రీనివాసరావు, పెద్దిరాజు, కర్రి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

సత్తుపల్లిరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలోని నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచలోహ వక్షస్థలం ఆభరణానికి దాతలు సోమవారం రూ.32,116గా ఆర్థిక సాయం అందించారు. దాతలు జేవీఆర్ ఓసీలోని సర్వేయర్ గనిగంటి బాలకృష్ణ, రాధిక, బొల్లం చంద్రమౌళి, వందనాదేవిలను స్వామివారి శేషవస్త్రంతో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, ఉబ్బల వెంకటేశ్వరరావు, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.